

# ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 06-06-2026 | సంపుటి - 28 | సంచిక -11 | రూ : 4 | పేజీలు: 8


## కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు






- ఆ స్థలాల్లో మహిళలకు వాటా కల్పిస్తాం : మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

హైదరాబాద్ : పేదల జీవనోపాధికి ఏ మాత్రం ఇబ్బంది లేకుండా నియోజక వర్గాన్ని యూనిట్ గా తీసుకొని క్యూర్ పరిధిలో పేదలు నివాసముంటున్న ప్రాంతాలకు సమీపంలోనే అల్పదాయ (ఎల్ఐజీ), మధ్యతరగతి వర్గాలకు (ఎంఐజీ) లక్ష ఇండ్లు నిర్మించబోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాల్లో లక్ష ఇండ్లను నిర్మించి ఆ స్థలంలో వారి వాటాకు యజమానిని చేస్తూ పేదింటి ఆడబిడ్డలకు ఇవ్వబోతున్నామని ప్రకటించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై శుక్రవారం హైదరాబాద్ సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. 202627 ఆర్థిక సంవత్సరానికి క్యూర్ పరిధిలో లక్ష ఇండ్లకు, ఇతర ప్రాంతాల్లో తరువాయి 2లో



## రెండేండ్లలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి

- మొదటి దశలో పాలమూరు నుంచి ఉద్దండపూర్ వరకు
- 26 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం
- 30 నెలల్లో రూ.32 వేల కోట్లు ప్రాజెక్టుల అప్పులు కట్టాం
- నోరు తెరిస్తే బీఆర్ఎస్ నేతలు అబద్దాలు మాట్లాడుతున్నారు
- పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలకు మంత్రి పొన్నం సమాధానం చెప్పారు
- ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పనుల పురోగతిపై ఉమ్మడి పాలమూరు జిల్లాలో రెండోరోజు పర్యటన
- తెలంగాణ నీటిపారుదల రంగం బీఆర్ఎస్ వల్లే నిర్వీర్యం: ఉత్తమ్

2లో



## భారత్ లో ఏఐ విప్లవం రూ.2.5 లక్షల కోట్ల భారీ ఒప్పందం

2లో

- భారత్‌లో డేటా సెంటర్ల ఏర్పాటు చేయనున్న ఎయిర్‌ట్రంక్
- ప్రధాని మోదీతో సంస్థ సీఈఓ రాబిన్ ఖుదా భేటీ
- 5 గిగావాట్ల సామర్థ్యంతో సరికొత్త కేంద్రాలు
- హైదరాబాద్, చెన్నై నగరాల్లో ప్రాజెక్టుల విస్తరణ
- ఎయిర్‌ట్రంక్ నిర్ణయంపై ప్రధాని హర్షం

## కేసీఆర్ రాసిపెట్టుకోండి.. మీ పార్టీని మళ్లీ మొలకెత్తనీయం

- మీ పదేళ్ల పాలన.. మా రెండున్నరేళ్ల పాలనపై సభలో చర్చిద్దామా?
- చర్చలో నేను ఓడితే.. అక్కడికక్కడే క్షమాపణ చెబుతా
- లేదంటే మీరు ఫామ్‌హౌస్‌కే పరిమితం కండి
- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇచ్చిన చోటే మీరు ఓట్లు అడగాలి
- ఇందిరమ్మ ఇళ్లు కట్టిన చోటే మేము ఓట్లు అడుగుతాం
- 2029 ఎన్నికల్లోనూ మిమ్మల్ని ఓడిస్తాం
- 'ప్రజా పాలనప్రగతి ప్రణాళిక' సభలో సీఎం రేవంత్‌రెడ్డి

2లో



## కేరళను ముంచెత్తుతున్న భారీ వర్షాలు.. ఐఎండీ హెచ్చరిక



- కేరళలో తీవ్రరూపం దాల్చిన నైరుతి రుతుపవనాలు
- ఐదు ఉత్తర జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ
- శనివారం అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక

2లో



## ఇది ఏఐ తయారు చేసిన వ్యాక్సిన్ ప్రపంచంలో ఇదే మొదటిసారి!

- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో యూనివర్సల్ వ్యాక్సిన్ రూపకల్పన
- తొలి దశ క్లినికల్ ట్రయల్స్‌లో సానుకూల ఫలితాలు
- అన్ని రకాల కరోనా వైరస్‌ల నుంచి రక్షణ కల్పించేలా పరిశోధన
- భవిష్యత్ మహమ్మారులను అడ్డుకోవడమే లక్ష్యమని శాస్త్రవేత్తల వెల్లడి

## భారత్‌కు ఎస్ యూ57 స్టెల్త్ ఫైటర్లు... పుతిన్ బంపర్ ఆఫర్!

- SU57 యుద్ధ విమానాలను సంయుక్తంగా అభివృద్ధి చేద్దామన్న పుతిన్
- టెక్నాలజీ బదిలీపై ఎలాంటి ఆంక్షలు ఉండవని స్పష్టం
- స్వదేశీ AMCA ప్రాజెక్టు ఆలస్యం నేపథ్యంలో రష్యా ప్రతిపాదన
- గతంలో అధిక వ్యయంతో నిలిచిపోయిన ఫైటర్ జెట్ ఒప్పందానికి మళ్లీ తెర
- ప్రస్తుతానికి ఇదే అత్యుత్తమ యుద్ధ విమానమని పుతిన్ వ్యాఖ్య



2లో




## ఐటీఆర్ ఫైలింగ్ కొత్త గడువులు ఖరారు.. మిస్ అయితే జరిమానా!

- 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఐటీఆర్ ఫైలింగ్ గడువులు ఖరారు
- వేతన జీవులకు జులై 31, ఆడిట్ లేని వ్యాపారాలకు ఆగస్టు 31 చివరి తేదీ
- గడువు దాటితే రూ.5,000 వరకు ఆలస్య రుసుము, వడ్డీ చెల్లించాలి
- డిసెంబర్ 31 వరకు బిలేటెడ్ రిటర్న్ ఫైల్ చేసేందుకు అవకాశం

2లో

# రెండేండ్లలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి

మహబూబ్‌నగర్ : రాబోయే రెండేండ్లలో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి 26 లక్షల ఎకరాలకు సాగు నీరందిస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రాజెక్టుల్లో జరుగుతున్న పనుల పురోగతిపై మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లాలో రెండో రోజు పర్యటించారు. ఈ సందర్భంగా భూత్పూర్ మండలంలోని కరివేన గ్రామంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టుల పనుల కోసం పదేండ్ల కేసీఆర్ పాలనలో రూ. లక్షా 81 వేల కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. అందులో రూ. లక్ష కోట్లు కేవలం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికే ఖర్చు చేశారని గుర్తు చేశారు. అత్యంత కీలకమైన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని బీఆర్ఎస్ సర్కారు నిర్లక్ష్యం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, కల్వకుర్తి, ఇతర ప్రాజెక్టులతోపాటు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలను పూర్తి చేస్తే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సస్యశ్యామలమవుతుందని పేర్కొన్నారు. మొదటి దశలో పాలమూరు నుంచి ఉద్దండపూర్ వరకు పూర్తి చేస్తామని తెలిపారు. పదేండ్ల కాలంలో పాలమూరు ఎత్తిపోతలకు బీఆర్ఎస్ సర్కార్ ఖర్చు చేసిన వ్యయంలో పంపులు, లిఫ్టుల ద్వారా రూ.27 వేల కోట్ల కమీషన్లు కొల్లగొట్టారని విమర్శించారు. 'పాలమూరు జిల్లాలోని ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయలేదు. ఒక్క ఎకరాకూ నీరు ఇవ్వకుండా ఎక్కడికక్కడే వదిలేశారు. జిల్లాలో ఏ ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణ జరగలేదు. అలాంటప్పుడు ప్రాజెక్టులు పూర్తి అవుతాయని కేసీఆర్ ఎలా భావించారు. ఆయన ఆలోచన ఎంతసేపూ పంపులు, లిఫ్టులు, వేల కోట్లు కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులు, కమీషన్లు కొట్టేయడమే. ఈ జిల్లాలో పుట్టి పెరిగిన నేను ఈ ప్రాజెక్టులను ఒక కొలిక్కి తీసుకొద్దామని ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్ రాజకీయం చేస్తోంది' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు చీదరించుకుంటారన్న సోయి కూడా లేకుండా బీఆర్ఎస్ నేతలు ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్‌కు ఊడిగం చేయడం మానేయాలని హితవు పలికారు. కర్నాటక ప్రభుత్వం కృష్ణానది పొడవున బ్రిడ్జి కం బ్యారేజ్ ల పేరుతో 100 టీఎంసీల నీటిని నిల్వ చేసిందని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం కూడా అదే తరహాలో కర్నాటకతో కలిసి సంయుక్తంగా బ్రిడ్జ్ కం బ్యారేజ్‌ను నిర్మించేందుకు చర్చలు జరుపుతోందని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి ఎన్డీఎస్ఏ నివేదిక ప్రకారం పనులు మొదలుపెడతామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. గత ప్రభుత్వంలా తొందరపడితే ఎలాంటి ఫలితాలు వస్తాయో, గత అనుభవం తెలిపిందని అన్నారు. తమకు అన్ని ప్రాంతాలు సమానమేనని స్పష్టం చేశారు. గోదావరిలో 960 టీఎంసీల వాటాలు పూర్తిగా వినియోగించుకునేందుకు ప్రయత్నిస్తామన్నారు. పాలమూరుకు సంబంధించి 90 టీఎంసీలు, డిండికి సంబంధించి 20 టీఎం సీల లెక్క తేలిన తర్వాతే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో చర్చలు ఉంటాయని స్పష్టం చేశారు. కృష్ణా నీటికి సంబంధించి గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందమే తెలంగాణ పాలిట మరణ శాసనమైందని ఆందోళన వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యల పై మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానం చెప్పారని తాను చెప్పేదేమీ లేదని ఆయన స్పష్టం చేశారు.

## కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు

హైదరాబాద్ : పేదల జీవనోపాధికి ఏ మాత్రం ఇబ్బంది లేకుండా నియోజక వర్గాన్ని యూనిట్ గా తీసుకొని క్యూర్ పరిధిలో పేదలు నివాసముంటున్న ప్రాంతాలకు సమీపంలోనే అల్పదాయ (ఎల్ఐజీ), మధ్యతరగతి వర్గాలకు (ఎంఐజీ) లక్ష ఇండ్లు నిర్మించబోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాల్లో లక్ష ఇండ్లను నిర్మించి ఆ స్థలంలో వారి వాటాకు యజమానిని చేస్తూ పేదింటి ఆడబిడ్డలకు ఇవ్వబోతున్నామని ప్రకటించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై శుక్రవారం హైదరాబాద్ సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. 202627 ఆర్థిక సంవత్సరానికి క్యూర్ పరిధిలో లక్ష ఇండ్లకు, ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షలు, మొత్తం 3.50 లక్షల ఇండ్లకు ఇప్పటికే పరిపాలనపరమైన అనుమతులు ఇచ్చినట్టు తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అవసరమైన కార్యాచరణను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం పేదల జీవన పరిస్థితులను, వారి ఉపాధి అవసరాలను ఏ మాత్రం పట్టించుకోకుండా హైదరాబాద్ నగరానికి 30 40 కిలోమీటర్ల దూరంలో అరకొరగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించిందని మంత్రి విమర్శించారు. ఇల్లు అనేది పేద కుటుంబానికి ఎంత అవసరమో, వారి జీవనోపాధి కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని గత పాలకులు విస్మరించారని తప్పుపట్టారు. రోజువారీ కూలి పనులు, చిన్న వ్యాపారాలు, ఉపాధి అవకాశాలపై ఆధారపడే పేద కుటుంబాలు నగర శివార్లలో నిర్మించిన ఇళ్లకు వెళ్లలేకపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి దూరమవడంతో పాటు పిల్లల విద్య, వైద్య సదుపాయాలు, రవాణా వంటి సమస్యలు ఎదురవడంతో అనేక కుటుంబాలు ఆ ఇళ్లలో నివసించడానికి ఆసక్తి చూపలేదని వివరించారు. ఫలితంగా ఆ గృహాలు ఖాళీగా, నిరుపయోగంగా మిగిలిపోయాయని చెప్పారు. ఇలాంటి తప్పిదాలను పునరావృతం చేయకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాల్లోనే గౌరవప్రదమైన జీవితం గడిపేలా ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టబోతున్నామని స్పష్టం చేశారు. ఈ దిశగా విలువైన ప్రభుత్వ భూములను పేదల సంక్షేమం కోసం వినియోగిస్తూ లక్ష ఇండ్ల నిర్మాణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామని మంత్రి వెల్లడించారు. ముఖ్యంగా పేద కుటుంబాల మహిళలకు సొంతింటిపై హక్కు కల్పించడం ద్వారా వారి ఆర్థిక, సామాజిక భద్రతను మరింత బలోపేతం చేయనున్నట్టు మంత్రి తెలిపారు. సొంత ఇల్లు మహిళ సాధికారతకు, కుటుంబ స్థిరత్వానికి, భవిష్యత్ తరాల అభివృద్ధికి బలమైన పునాది అవుతుందన్నారు. పేదల అవసరాలను దృష్టిలో పెట్టుకొని వారికి సౌకర్యవంతంగా ఉండేలా ఇండ్ల డిజైన్ లను రూపొందించాలనీ, ఇంటి నిర్మాణం కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణం ఉండేలా ప్లాన్ చేయాలని అధికారులను ఆదేశించారు.

## కేసీఆర్ రాసిపెట్టుకోండి.. మీ పార్టీని మళ్లీ మొలకెత్తనీయం

మహబూబ్‌నగర్: ''కేసీఆర్ రాసిపెట్టుకోండి.. ఏ ఊర్లో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారో.. ఆ ఇళ్లు కట్టిన చోటే మీరు ఓట్లు అడగాలి. ఇందిరమ్మ ఇళ్లు కట్టిన చోటే మేము ఓట్లు అడుగుతాం. ఇళ్లు, రిజర్వాయర్లు ఇస్తామని చెప్పి మోసం చేసి.. ఇప్పుడు ఇక్కడి అభివృద్ధిని అడ్డుకుంటారా? అభివృద్ధిని అడ్డుకుంటే.. పాలమూరు జిల్లాలో మీ పార్టీని మళ్లీ మొలకెత్తనీయం. మీ జెండా ఎగరనీయం. భవిష్యత్‌లో మీ పార్టీ గుర్తు మీద ఒక్క ఎమ్మెల్యేను కూడా గెలవనీయం. 2029 ఎన్నికల్లోనూ ఓడిస్తాం. కాంగ్రెస్‌ను తిరిగి అధికారంలోకి తీసుకొస్తాం'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలోని గంగాపూర్ వద్ద శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన 'ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక' బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. 'మీ పదేళ్ల పాలనలో.. మా రెండున్నరేళ్ల పాలనలో ఏం చేశామో.. అసెంబ్లీలో చర్చిద్దామా? కేసీఆర్..మీరు అసెంబ్లీకి రండి. చర్చలో నేను ఓడితే.. అక్కడికక్కడే క్షమాపణ చెబుతా. లేకపోతే మీరు ఫామ్‌హౌస్‌కే పరిమితం కండి' అని సీఎం రేవంత్..భారాస అధినేతకు సవాల్ విసిరారు. ''రేవంత్‌రెడ్డి ఏం చేశారని కొందరు అవాకులు చవాకులు పేలుతున్నారు. వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు.. ఒక్క రేషన్ కార్డు ఇచ్చారా? ఒక్క ఇల్లు కట్టిచ్చారా? ఉచిత కరెంటు ఇచ్చారా? ఉచిత బస్సు సౌకర్యం కల్పించారా? మా ప్రభుత్వం వచ్చాక.. 15 లక్షల రేషన్‌కార్డులు ఇచ్చాం. 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం. రూ.10వేల కోట్లు మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి ఇచ్చాం. 1,000 బస్సులకు మహిళలను యజమానులను చేశాం. 67,616 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీచేశాం. రూ.20,616 కోట్ల రుణమాఫీ, రూ.27వేల కోట్ల రైతుభరోసా అందించాం.



*** ఐదేళ్లు ఎంపీగా ఉన్నా.. ఐదుసార్లు కూడా జిల్లాకు రాలేదు**

పాలమూరు బిడ్డనైన నేను రెండు రోజులుగా ఈ గడ్డపై.. విస్తృతంగా తిరిగా. ఇక్కడి తాగు, సాగునీటి అవసరాల కోసం.. పడావుపడిన ప్రాజెక్టులను పరిశీలించా. పరిష్కారాల కోసం యంత్రాంగానికి సూచనలిచ్చా. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో తీవ్రంగా నష్టాలు, కష్టాలు ఎదుర్కొంటున్న నా సోదర సోదరీమణుల ఆవేదనను తెలుసుకున్నా. మీ అందరికీ గుర్తుండే ఉండొచ్చు. 2009లో ఒక నాయకుడు ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని.. కరీంనగర్‌లో ఓడిపోతానని.. అక్కడి నుంచి ఇక్కడకు వచ్చారు. తెలంగాణ ఉద్యమం పేరు చెప్పి.. పాలమూరు జిల్లా వలసలు, రైతుల ఆత్మహత్యలు, కాలిపోతున్న మోటార్లు, పేలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లను ప్రస్తావించి పాలమూరు ఎంపీగా గెలిపించాలని కోరారు. వలసల కష్టాలు, ఆత్మహత్యల నష్టాలు మనకు తెలుసు. వాటిని పార్లమెంటులో చెబుతారనే నమ్మకంతో.. కరీంనగర్ నుంచి రాజకీయంగా వలస వచ్చిన కేసీఆర్‌ను మనం గుండెల్లో పెట్టుకొని అందరం కష్టపడి గెలిపించుకున్నాం. గెలిచిన కేసీఆర్ ఐదేళ్లు ఎంపీగా ఉన్నా.. కనీసం ఐదుసార్లు కూడా మన జిల్లాకు రాలేదు. అయినా మనమేమీ బాధపడలేదు. దేవుడు కరుణించాడు. సోనియమ్మ ఆశీర్వదించారు. మన్మోహన్‌సింగ్ చట్టం తెచ్చారు. జూన్ 2, 2014న తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారు.

*** ఆయన.. తర్వాత కొడుకు.. ఆ తర్వాత మనవడు రాజ్యం ఏలుతారట!**

ఇక ఏ తెలంగాణ బిడ్డ మరణించొద్దు.. ఏ తల్లీ కడుపుకోత అనుభవించొద్దు అని.. ఆ తల్లుల దుఃఖాన్ని ఆపాలని ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ చచ్చిపోయినా.. రాజకీయ స్వార్థాన్ని వదిలేసి సోనియా ధనిక రాష్ట్రంగా తెలంగాణను అప్పగించారు. కానీ కేసీఆర్ మోసాన్ని గుర్తించలేని తెలంగాణ ప్రజలు.. రెండుసార్లు ఆయన్ను ముఖ్యమంత్రిని చేశారు. పదేళ్లలో పాలమూరు జిల్లాలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తిచేయలేదు. ఉదండాపూర్ మునిగితే రూ.800 కోట్లు ఇవ్వలేదు. మన కష్టాలు తీర్చలేదు. మన కన్నీళ్లు తుడవలేదు. మనకు సాగునీరు రాలేదు. తాగునీరు దక్కలేదు. కేసీఆర్‌ను ఈ వేదికపై నుంచి అడుగుతున్నా.. ఆనాడు ప్రారంభించిన జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిల సాగర్, కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాల్లో ఏ ఒక్క ప్రాజెక్టు అయినా.. మీరు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పూర్తిచేయలేదు? ఆయన.. తర్వాత ఆయన కొడుకు.. ఆ తర్వాత ఆయన మనవడు రాజ్యం ఏలుతారట! మనమేమో చేపలు పట్టుకుంటూ.. చెప్పులు కుట్టుకుంటూ బతకాలట!

## భారత్ లో ఏఐ విప్లవం
## రూ.2.5 లక్షల కోట్ల భారీ ఒప్పందం

భారత్‌ను అంతర్జాతీయ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్ హబ్‌గా మార్చే దిశగా చరిత్రాత్మక ముందడుగు పడింది. ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ డేటా సెంటర్ల సంస్థ 'ఎయిర్‌ట్రంక్' రాబోయే నాలుగేళ్లలో మనదేశంలో ఏకంగా 30 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 2.50 లక్షల కోట్లు) భారీ పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ పరిణామంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ భారీ ప్రాజెక్టు ద్వారా భారతదేశంలో ఐదు గిగావాట్ల సామర్థ్యం గల సరికొత్త డేటా సెంటర్లను నిర్మించనున్నారు. సిడ్నీ ప్రధాన కేంద్రంగా పనిచేసే ఎయిర్‌ట్రంక్ సంస్థకు అంతర్జాతీయ ఇన్వెస్టర్లు బ్లాక్‌స్టోన్, కెనడియన్ పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్ నిధులు సమకూరుస్తున్నాయి. ఈ ఏడాది ఆరంభంలో 'లుమినా క్లౌడ్‌ఇన్‌ఫ్రా' సంస్థను కొనుగోలు చేయడం ద్వారా ఎయిర్‌ట్రంక్ భారత మార్కెట్లోకి అడుగుపెట్టింది. మోదీ శుక్రవారం ఎయిర్‌ట్రంక్ సీఈఓ రాబిన్ ఖుదాతో సమావేశమయ్యారు. అనంతరం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. దేశ డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలోనే ఇది భారీ పెట్టుబడి అని కొనియాడారు. ఈ ప్రాజెక్ట్ వల్ల దేశంలో లక్షలాది ఉపాధి అవకాశాలు లభిస్తాయని, స్థానిక సప్లై చైన్ వ్యవస్థ బలోపేతం అవుతుందని, క్లౌడ్ రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎయిర్‌ట్రంక్ సంస్థ ముంబై, చెన్నై, హైదరాబాద్ నగరాల్లో 600 మెగావాట్ల సామర్థ్యంతో ప్రాజెక్టులను నిర్మిస్తోంది. తాజా రూ.2.50 లక్షల కోట్ల పెట్టుబడితో ఈ సామర్థ్యాన్ని మరింత విస్తరించనుంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ రేసు తీవ్రమవుతోందని, పెట్టుబడులను ఆకర్షించడంలో భారత్ చూపిస్తున్న వేగం, పారదర్శకత తమను ఎంతగానో ఆకట్టుకున్నాయని రాబిన్ ఖుదా ప్రశంసించారు.

## కేరళను ముంచెత్తుతున్న భారీ వర్షాలు..ఐఎండీ హెచ్చరిక

జూన్ 4న కేరళను పలకరించిన నైరుతి రుతుపవనాలు ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చాయి. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండటంతో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఈ సీజన్‌లో తొలిసారిగా రెడ్ అలర్ట్ జారీ చేసింది. కేరళ ఉత్తర భాగంలోని ఐదు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న నివేదికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం ఉదయం కోజికోడ్ తదితర ప్రాంతాల్లో బలమైన ఈదురు గాలుల ధాటికి చెట్లు నేలకూలాయి. శనివారం మలప్పురం, కోజికోడ్, వయనాడ్, కన్నూర్, కాసరగడ్ జిల్లాల్లో 24 గంటల వ్యవధిలో 20 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. మరికొన్ని జిల్లాలకు ఆదివారం కూడా ఈ హెచ్చరికలు వర్తిస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. మరోవైపు ఇడుక్కి, త్రిస్సూర్, ఎర్నాకుళం, కొట్టాయం, పాలక్కాడ్, పతనంతిట్ట జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, అలప్పుజ, కొల్లం, తిరువనంతపురం జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తూ, ఉరుములతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. సాధారణ తేదీ కంటే ఆలస్యంగా రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ, వాటి తీవ్రత అధికంగా ఉండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు లేదా సహాయక శిబిరాలకు తరలివెళ్లాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది. పర్యాటక ప్రాంతాలు, నదులు, కొండ ప్రాంతాలకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని హెచ్చరించింది. అత్యవసర సహాయం కోసం 1077, 1070 హెల్ప్ లైన్ నంబర్లను సంప్రదించాలని కోరింది. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని, అధికారులు పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారని సమాచారం.

## ఐటీఆర్ ఫైలింగ్.. కొత్త గడువులు ఖరారు.. మిస్ అయితే జరిమానా!

2025-26 ఆర్థిక సంవత్సరానికి (అసెస్మెంట్ ఇయర్ 2026-27) సంబంధించిన ఆదాయ పన్ను రిటర్నుల (ఐటీఆర్) దాఖలు గడువు తేదీలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఈసారి వివిధ వర్గాల పన్ను చెల్లింపుదారులకు వేర్వేరు గడువులను నిర్దేశించింది. కేంద్ర ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో ప్రకటించినట్లుగా ఈ మార్పులు చేశారు. కొత్త నిబంధనల ప్రకారం, జీతాలు పొందే ఉద్యోగులు (సాధారణంగా ఐటీఆర్1, ఐటీఆర్2 ఫైల్ చేసేవారు) తమ రిటర్నులను 2026 జులై 31లోగా దాఖలు చేయాలి. ఆడిట్ పరిధిలోకి రాని వ్యాపారాలు, ఫ్యూచర్స్ & ఆప్షన్స్ ట్రేడింగ్ ద్వారా ఆదాయం పొందుతున్న వ్యక్తులు, ట్రస్టుల వంటి వాటికి 2026 ఆగస్టు 31 వరకు గడువును పొడిగించారు. నిర్ణీత గడువులోగా ఐటీఆర్ ఫైల్ చేయడంలో విఫలమైతే జరిమానాలు ఎదుర్కోవలసి ఉంటుంది. సెక్షన్ 234ఎఫ్ ప్రకారం, మొత్తం ఆదాయం రూ.5 లక్షలు దాటిన వారికి రూ.5,000, రూ.5 లక్షలలోపు ఆదాయం ఉన్నవారికి రూ.1,000 ఆలస్య రుసుము విధిస్తారు. దీంతో పాటు, చెల్లించాల్సిన పన్ను మొత్తంపై నెలకు 1 శాతం చొప్పున వడ్డీ కూడా చెల్లించాలి. ఒకవేళ గడువు తేదీని మిస్ అయినా, పన్ను చెల్లింపుదారులకు కొన్ని అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. 2026 డిసెంబర్ 31 వరకు 'బిలేటెడ్ రిటర్న్' దాఖలు చేయవచ్చు. అలాగే, చాలా కాలం తర్వాత కూడా తప్పులను సరిదిద్దుకోవడానికి లేదా రిటర్న్ దాఖలు చేయడానికి 2031 మార్చి 31 వరకు 'అప్‌డేటెడ్ రిటర్న్' (ఐటీఆర్‌యూ) సౌకర్యం ఉంది.

## ఇది ఏఐ తయారు చేసిన వ్యాక్సిన్.. ప్రపంచంలో ఇదే మొదటిసారి!

వైద్య రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మరో మైలురాయిని అధిగమించింది. ఏఐ సహాయంతో రూపొందించిన ప్రపంచపు తొలి వ్యాక్సిన్, ప్రాథమిక దశ మానవ ప్రయోగాల్లో (క్లినికల్ ట్రయల్స్) విజయవంతమైంది. భవిష్యత్తులో సంభవించే మహమ్మారులను సమర్థంగా ఎదుర్కొనే దిశగా ఇది ఒక కీలక పరిణామమని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ పరిశోధకులు ప్రకటించారు. 'pEVACPS' పేరుతో పిలిచే ఈ నూతన వ్యాక్సిన్‌ను తొలి దశలో భాగంగా 39 మంది ఆరోగ్యవంతులపై పరీక్షించారు. ఈ ప్రయోగాల్లో వ్యాక్సిన్ పూర్తిగా సురక్షితమని తేలిందని, వలంటీర్లలో ఎలాంటి తీవ్రమైన దుష్ప్రభావాలు తలెత్తలేదని శాస్త్రవేత్తలు వెల్లడించారు. కరోనా వైరస్ కుటుంబంలోని అన్ని రకాల వేరియంట్లను దీటుగా ఎదుర్కొనేలా రోగనిరోధక వ్యవస్థను సిద్ధం చేసే 'సూపర్‌యాంటిజెన్'ను ఏఐ ద్వారా అభివృద్ధి చేశారు. వైరస్‌ల జన్యుక్రమంలో మార్పు చెందని కీలక భాగాలను లక్ష్యంగా చేసుకుని ఇది పనిచేస్తుంది. సాధారణంగా వైరస్‌లు కొత్త రూపాంతరం చెందినప్పుడు అందుకు అనుగుణంగా వ్యాక్సిన్‌లలో మార్పులు చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ సరికొత్త విధానం వైరస్‌లు ప్రబలకముందే వాటిని నిరోధించేలా పనిచేస్తుందని పరిశోధనకు నేతృత్వం వహించిన ప్రొఫెసర్ జొనాథన్ హీనీ తెలిపారు. జంతువుల నుంచి మనుషులకు సోకే కొత్త రకం వైరస్‌లను సైతం ఇది సమర్థంగా అడ్డుకోగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పరిశోధన ఫలితాలు ప్రతిష్ఠాత్మక 'జర్నల్ ఆఫ్ ఇన్ఫెక్షన్'లో ప్రచురితమయ్యాయి. ప్రస్తుతం 200 మందికి పైగా వలంటీర్లతో రెండో దశ ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో ఈ టెక్నాలజీని ఫ్లూ, ఎబోలా వంటి ఇతర ప్రాణాంతక వైరస్‌లకు వ్యాక్సిన్‌ల తయారీలోనూ వినియోగించే అవకాశాలను పరిశీలిస్తున్నారు. పూర్తిస్థాయి ఫలితాల కోసం మరిన్ని పరీక్షలు అవసరమైనప్పటికీ, ప్రజారోగ్య పరిరక్షణలో ఇది ఒక గొప్ప ముందడుగు అని వైద్య నిపుణులు అభివర్ణిస్తున్నారు.

## భారత్‌కు ఎస్ యూ57 స్టెల్త్ ఫైటర్లు... పుతిన్ బంపర్ ఆఫర్!

భారత్‌తో రక్షణ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కీలక ప్రతిపాదన చేశారు. ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ అయిన 'సుఖోయ్57'ను భారత్‌తో కలిసి ఉమ్మడిగా అభివృద్ధి చేసేందుకు, ఉత్పత్తి చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఈ యుద్ధ విమానానికి సంబంధించిన పూర్తి సాంకేతికతను బదిలీ చేసేందుకు ఎలాంటి ఆంక్షలు విధించబోమని ఆయన స్పష్టం చేశారు. గురువారం రాత్రి అంతర్జాతీయ వార్తా సంస్థల ప్రతినిధులతో మాట్లాడిన సందర్భంగా పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రస్తుతం అందుబాటులో ఉన్న యుద్ధ విమానాల్లో SU57 అత్యుత్తమమైనదని నేను భావిస్తున్నాను. ఈ ఐదో తరం విమానాన్ని సంయుక్తంగా అభివృద్ధి చేద్దామని భారత మిత్రులకు మేం ప్రతిపాదించాం. ఈ విషయంలో కలిసి పనిచేయడానికి రష్యా సిద్ధంగా ఉంది, దీనిపై ఎటువంటి పరిమితులు ఉండవు" అని పుతిన్ వివరించారు.

# పర్యావరణాన్ని పరిరక్షించి భావితరాలను కాపాడుకుందాం

* **సహాయ డైరెక్టర్ హార్టికల్చర్ ల్యాండ్ కేఫ్ డివిజన్,అర్బన్ ఫారెస్ట్రీ (హెచ్.ఎం.డి.ఏ)దోనేపూడి చక్రపాణి**






జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : పర్యావరణాన్ని పరిరక్షించి భావితరాలను కాపాడుకుందామని సహాయ డైరెక్టర్ హార్టికల్చర్ ల్యాండ్ కేఫ్ డివిజన్,అర్బన్ ఫారెస్ట్రీ (హెచ్.ఎం.డి.ఏ) దోనేపూడి చక్రపాణి అన్నారు. శుక్రవారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం(వరల్డ్ ఎన్విరాన్మెంట్ డే ) పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజక వర్గం,రోడామేస్త్రినగర్ డివిజన్,మగ్దుమ్ నగర్ లోని చైతన్య విద్యానికేతన్ పాఠశాల ప్రాంగణంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు,చైతన్య విద్యానికేతన్ విద్యాసంస్థల చైర్మన్,కరస్పాండెంట్ శివరాత్రి యాదగిరితో పాటు పలువురు ఎన్.బ్ల్యు.సి ప్రతినిధులు,టిఆర్ ట్రస్టు ప్రతినిధుల బృందంతో కలిసి వారు పూల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమానికి వారితోపాటు అతిథులుగా ఎన్. డబ్ల్యూ.సీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్. ఏవి.శ్రీలక్ష్మి, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ జమ్మా రామ్ చౌదరి,ఫ్యూచర్ బిజినెస్ హౌస్ ప్రతినిధి ఉదయ భాస్కర్,టీఆర్ 9,టిఆర్.చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, సీఈవో తూర్పు రమేష్,ఎన్. డబ్ల్యూ.సి రాష్ట్ర డైరెక్టర్ శివరాత్రి నిఖిల్,రాష్ట్ర వైస్ చైర్మన్ వంగల సతీష్,సమాజ సేవకులు,చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ సలహాదారులు గడ్డం శ్రీధర్ సిద్దు లు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణే ప్రపంచ మనుగడకు దిశా నిర్దేశమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన పెంచడానికి,ఈ భూమిని కాపాడుకోవడానికి ఐక్యరాజ్యసమితి(యూ.ఎన్ ) జూన్ 5 ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ వారోత్సవాలలో భాగంగా 5 నుండి 11 వరకు వేడుకలు కొనసాగనున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణలో చెట్ల పెంపకం,వాటి ప్రాధాన్యత గురించి వివరించారు.ప్లాస్టిక్ కాలుష్యం,గ్లోబల్ వార్మింగ్, అడవుల నరికివేత వంటి తీవ్రమైన సమస్యలపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పించడం,చెట్లను నాటడం, వీటిని సంరక్షించడం,కాలుష్యాన్ని తగ్గించే పనులకు శ్రీకారం చుట్టాలన్నారు.. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ,చెట్ల పెంపకం,అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మంగాదేవి,ఎన్. డబ్ల్యూ.సీ మేడ్చల్ జిల్లా చైర్మన్,పాఠశాల ప్రిన్సిపాల్ శివరాత్రి సాయితేజ, ఇన్చార్జి ఎం.గీత, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలే మార్గం

* **ప్రకృతి ప్రేమికులు మొక్కల రాజశేఖర్‌కు ఘన సన్మానం**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రామవరం 15వ డివిజన్ తెలంగాణ క్రీడా ప్రాంగణం పార్కులో శుక్రవారం మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు. వరల్డ్ ఎన్విరాన్మెంట్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూఈఓ) వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సి.హెచ్. భద్ర, జనరల్ సెక్రటరీ నిఖిల్ సాయి ఆదేశాల మేరకు రాష్ట్ర కార్యదర్శి క్రాంతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగల భూపేష్, గౌరవ సభ్యులు సతీష్, సైదా నాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు.కార్యక్రమంలో 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ, సీపీఐ సీనియర్ నాయకుడు జమలయ్య, ప్రజాకవి తుమ్మల శ్రీనివాస్, కొయ్యడ వెంకటేశ్వర్లు, సామర్ల సమ్మయ్య, అన్నవరం, అమీద్, మోయినుద్దీన్, ప్రకృతి హరిత దీక్ష గౌరవ సభ్యులు దశరథ్ రజువా, ఎం.డి. ముస్తఫా పర్వీన్, ఎం.డి. రేష్మ, మొక్కల శనగ కళ్యాణ్, చిన్నారి ప్రకృతి ప్రేమికులు నైనిక రజువా, ఎం.డి. అఫాన్ జైదీ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వక్తలు సూచించారు. అనంతరం ప్రకృతి సేవలో విశిష్ట కృషి చేస్తున్న "మొక్కల రాజశేఖర్"ను డబ్ల్యూఈఓ ప్రతినిధులు, ప్రజాకవి తుమ్మల శ్రీనివాస్, కార్పొరేటర్ ఆకునూరి సుప్రియలు ఘనంగా సన్మానించారు.

## ధాన్యం కొనుగోళ్లలో జాప్యానికి తావివ్వొద్దు

* **అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ ఆదేశం**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీతో పాటు రుద్ర కాటన్ మిల్లును ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ తీరును పరిశీలించిన ఆయన, రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వాహనాల నుంచి వేగంగా దిగుమతి చేసి నిల్వ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రైతులు అనవసరంగా వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత ఇన్‌చార్జ్‌లకు ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. తనిఖీలలో డీఎం రాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి... పర్యావరణాన్ని పరిరక్షించండి

* **16వ జిల్లా అదనపు జడ్జి ఎస్ ఎస్ స్వాతి రెడ్డి**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అనే నినాదాన్ని నిజం చేస్తూ, ప్రాణుల మనుగడకు ప్రకృతే జీవనాధారమని, పుడమి పచ్చగా ఉంటేనే ప్రతి జీవి సుభిక్షంగా ఉంటుందని, భావితరాలకు మంచి జరగాలంటే మనం ఇప్పటి నుంచే పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ , 16వ అదనపు జిల్లా జడ్జి ఎస్. స్వాతి రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్. స్వాతి రెడ్డి ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోర్టు కాంప్లెక్స్ లో మొక్కలను నాటి కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రపంచ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కోర్టు కాంప్లెక్స్ లో మొక్కలు నాటిన కార్యక్రమంలో జిల్లా జడ్జితో పాటు జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మల్యాల సాహితి, రెండవ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్, న్యాయవాద బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీరంగూడ జగన్మోహన్ రెడ్డి ఉపాధ్యక్షురాలు సబియా సుల్తానా, బార్ అసోసియేషన్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అటవీ శాఖ అధికారి మొహమ్మద్ అజీజ్ అటవీ శాఖ తరపున ఎంతో విలువైన మొక్కలను అందించారు. ఈ సందర్భంగా ఎస్ స్వాతి రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకండి పూర్తిగా తగ్గించాలని, మన జీవితాలతో పూర్తిగా మమేకమై ఉన్న పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు.

## ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యాల పట్ల శ్రద్ధ తీసుకోవాలి

* **రంగారెడ్డినగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యాల పట్ల శ్రద్ధ తీసుకోవాలని రంగారెడ్డినగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్ అన్నారు. శుక్రవారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ లో గల మహాత్మా గాంధీ కమ్యూనిటీ హాల్ లో స్వామి వివేకానంద యువజన సంఘం,ఏఐజి ఆసుపత్రి (గచ్చిబౌలి) వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు,అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు జీడిమెట్ల సిఐ గడ్డం మల్లేష్,సంఘ సభ్యులు పాల్గొని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇలాంటి వైద్య శిబిరాలను నిర్వహించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు.. ఈ శిబిరంలో వైద్య నిపుణురాలు డాక్టర్. ప్రజ్ఞ ఆధ్వర్యంలో సుమారు 104 మంది మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షులు జల్దా లక్ష్మినాథ్, స్థానిక నాయకులు ఖాజాబాయ్,అబ్దుల్ ఖాదర్, రంగా శ్రీనివాస్ గౌడ్,కమల బాయి,మణి, ఎండి.పాషా,ఎండి. షాకీర్,షకీల్,కొండా శ్రీను,అల్లాఉద్దీన్,రాంచందర్,టింకు గౌడ్,కమిటీ సభ్యులు తిమ్మయ్య,తుమ్మ నవీన్, ఆనంద్,వెంకట్ సాయి,మేకల సందీప్,ఏఐజి ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు..

## మాదిగలు అన్ని రంగాల్లో అత్యున్నత స్థాయికి ఎదగాలి

* **ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోవింద నరేష్ మాదిగ**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగి ఉన్న మాదిగలు విద్య, సామాజిక, ఆర్థిక, వ్యాపార, సంక్షేమ రంగాలతో పాటు ప్రధానంగా రాజకీయ రంగంలో అత్యున్నత స్థాయికి ఎదగాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోవిందు నరేష్ మాదిగ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా రెండవసారి ఎన్నికైనబోయ దేవేందర్ ను ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం శాలువా, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గోవింద నరేష్ మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ వల్లనే మాదిగలకు రాజకీయంగా గుర్తింపు లభించిందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు మాదిగలను గుర్తించగలిగేలా, వారికి తగిన ప్రాతినిధ్యం ఇచ్చేలా మందకృష్ణ మాదిగ తన పోరాటాన్ని ముందుకు నడిపించాలని కొనియాడారు. బోయ దేవేందర్ రెండోసారి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా ఎన్నిక కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మాదిగలు వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జాతికి సేవ చేయాలన్నారు. జాతి అన్ని రంగాల్లో ఎదగడానికి తమ వంతు పాత్రను పోషించాలన్నారు. అలాగే జాతికి కన్నా తల్లిలాగా నిలబడిన ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి నిత్యం అండగా నిలబడాలని, మూడు దశాబ్దాల పైగా జాతిని ముందుకు నడిపిస్తున్న ' పద్మశ్రీ ' మందకృష్ణ మాదిగను మర్చిపోవద్దని కోరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర నాయకుడు ఊదరి వెంకటేష్ మహాజన్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బోడ్డు శ్రవణ్ కుమార్, కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి సాయిలు, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు బోయ రాము, ఆరుట్ల లింగస్వామి, బొడ్డు గణేష్, ఊదరి భాస్కర్, బోదుల స్వామి, చెక్క లింగస్వామి, బీసీ సంఘం నాయకుడు వీరమల్ల సత్తయ్య, బుడగ జంగాల నాయకుడు ప్రభు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు పిల్లలకు ప్రవేట్ పాఠశాలలో ఫీజు రాయితీ ఇవ్వాలి

* **టీ యూ డబ్ల్యూ జే ( ఐజేయు ) ఆధ్వర్యంలో డి ఈ ఓ కు వినతి**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నల్గొండ జిల్లాలో వివిధ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న జర్నలిస్టు పిల్లలకు ఫీజుల్లో రాయితీ ఇవ్వాలని టి యు డబ్ల్యూ జె ( ఐ జె యూ ) ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి సుశీంద్రరావు రావుకు వినతిపత్రం అందజేశారు. డీఈవో స్పందిస్తూ వెంటనే 70% రాయితీ కల్పించడానికి పాఠశాలలకు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేయుచున్న జర్నలిస్టు పిల్లలు వివిధ ప్రవేట్ పాఠశాలలో చదువుతున్నారని అన్నారు. ప్రవేటు పాఠశాలలో వేలాది రూపాయలు ఫీజులు చెల్లించాల్సి ఉండటంతో ఆ ఫీజులను చెల్లించలేక చాలా ఇబ్బందులు పడు పడుతున్నారని పాఠశాల మేనేజ్మెంటు వారు ఫీజులు చెల్లించాలని వత్తిడి చేయడంతో కొందరు విద్యార్థిని విద్యార్థులు ఫీజులు చెల్లించలేక మధ్యలోనే విద్యను మానేస్తున్నారన్నారు. జర్నలిస్టు కుటుంబంలోని ఒకరికి పూర్తి రాయితిని, ఇంకొకరికి 50%, మరొకరి 30% రాయితీని ఇతర జిల్లాలో కల్పించడం జరుగుచున్నదని కావున మన నల్లగొండ జిల్లాలోని జర్నలిస్టు పిల్లలకు 75% ఫీజు రాయితీని కల్పించగలరని కోరినట్లు తెలిపారు,వినతి పత్రం అందజేసిన వాళ్ళలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు పరమేష్ , సంఘం నాయకులు మాదరి యాదగిరి, ఎర్రెడ్ల చంద్రశేఖర్ రెడ్డి, చిన్నపత్రికల సంఘం జిల్లా అధ్యక్షులు అబ్బోజు మదనాచారి, ఉపాధ్యక్షులు గంగాధర వెంకటేశ్వర్లు, నల్లగొండ నియోజకవర్గం అధ్యక్షుడు వంగాల శ్రీనివాసరెడ్డి , సహాయ కార్యదర్శి ఎండి సయ్యద్ , కోశాధికారి సోమచ్ చంద్రశేఖర్, పిట్టల రామకృష్ణ , ,దశరథ ఉయ్యాల లింగయ్య డిఎస్ యాదవ్, దొటి శ్రీనివాస్, పి అశోక్ కుమార్ ,వుర రమేష్, ఎస్ రాంప్రసాద్ , టి శంకర్ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ.. ప్రతి ఒక్కరి బాధ్యత

- **సర్పంచ్ కైరంకొండ స్వప్న అశోక్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని సర్పంచ్ కైరంకొండ స్వప్న అశోక్ అన్నారు. చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అమ్మ పేరు తో ఒక్క మొక్క కార్యక్రమం నిర్వహించారు. మొక్కను నాటి నీళ్ళు పోశారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వప్న అశోక్ మాట్లాడుతూ మొక్కల పెంపకం తోనే పర్యావరణ సమతుల్యం అవుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటాలని, బాధ్యతగా పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోతి, పిల్లలమర్రి సుజాత, మాదూరి నగేష్, రచ్చ ఉపేందర్, పిష్క సంజీవ కుమార్, గడ్డం అశోక్, సాయి, మురళి, నర్సింహా, సర్వయ్య, శ్రవణ్, గౌతమ్, ప్రసాద్, పావని, సునీత, వరలక్ష్మి, రాజు, శ్రీనివాస్, మల్లయ్య, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

* **మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**




ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అధ్యక్షతన బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బైకని శ్రీనివాస్ యాదవ్ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిగా హాజరై మండల, మున్సిపాలిటీల పార్టీ సమన్వయ కర్తలు, ముఖ్య నాయువుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు విస్తృతంగా నిర్వహించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ అధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేయాలని సూచించారు. రాష్ట్ర నాయకులు బైకని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, సభ్యత్వ నమోదు కార్యక్రమం పార్టీ సంస్థాగత బలోపేతానికి కీలకమని, నాయకులు సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను అధిగమించాలని కోరారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, రవీందర్ యాదవ్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ ఎస్సి ఎస్టీ కమీషన్ సభ్యులు రాంబాల్ నాయక్, మాజీ కార్పోరేషన్ చైర్మన్ రాజవరప్రసాద్, మహిళా నాయకురాలు రాజ్యలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ బక్కన్న యాదవ్, మాజీ పార్టీ అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీలు, బీఆర్ఎస్ శ్రేణులు హాజరయ్యారు.

## గడ్డి మంటలతో పామాయిల్ తోట దగ్ధం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : మహాముత్తారం మండలం పోలారం శివారులో గడ్డి కాల్చిన మంటలు వ్యాపించి నాలుగు ఎకరాల పామాయిల్ తోట దగ్ధమైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బాధిత రైతు సల్లూరి శంకర్‌కు చెందిన నాలుగు ఎకరాల పామాయిల్ తోటలోని సుమారు 224 చెట్లు మంటల్లో కాలిపోయాయి. తోటలో ఏర్పాటు చేసిన డ్రిప్ వ్యవస్థ కూడా పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలిసింది. స్థానికుల కథనం ప్రకారం... పామాయిల్ తోట పక్కనే ఉన్న పొలంలో గడ్డి కాల్చగా మంటలు అదుపు తప్పి తోటలోకి వ్యాపించాయి. దీంతో పామాయిల్ చెట్లతో పాటు డ్రిప్ పైపులు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. పక్కనే వరి సాగు చేస్తున్న రైతు నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు బాధితుడు ఆరోపించారు. ఈ ఘటనతో రైతుకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లినట్లు సమాచారం. అధికారులు ఘటనపై విచారణ చేపట్టి నష్టాన్ని అంచనా వేయాలని బాధిత రైతు కోరుతున్నారు.

# అర్బన్ ఫారెస్ట్ పార్కుల గొప్పతనాన్ని పర్యాటకుల కు ప్రాచుర్యం కల్పించాలి

*** జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**




ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామం వన్ యోజన అటవీ పార్కు నందు నిర్వహించిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్). హైదరాబాదు నుండి రత్నాకర్, డి ఎఫ్ ఓ జోజి, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి ఈ ఈ వేణు, సంబంధిత ఎఫ్ ఆర్ ఓ ,రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు, యాదగిరి, శర్మ రాజశేఖర్ సర్పంచ్ యాదగిరి, ఉపసర్పంచ్ ప్రసాద్ లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటారు.అనంతరం అటవీ శాఖ ఏర్పాటు పర్యావరణ పరిరక్షణపై జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అటవీ వారోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ప్రకారం జిల్లాలో ఈ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏక్ పెడ్ మా కే నామ్' ప్రతి భారతీయుడిని తమ తల్లి మరియు భూమాత గౌరవార్థం ఒక మొక్కను నాటమని ప్రోత్సహించే ఒక హృదయపూర్వక దేశవ్యాప్త పర్యావరణ ఉద్యమం అన్నారు.ఇది మాతృత్వంలోని పోషణ స్ఫూర్తిని, ప్రకృతి యొక్క జీవనాధార శక్తితో అనుసంధానించి, మరింత పచ్చని గ్రహాన్ని పెంపొందుతుంది అన్నారు. మానవాళి మనుగడకు మొక్కలే జీవనాధారాల అనే నినాదంతో ప్రతి ఒక్కరూ అమ్మ పేరు మీద ఒక మొక్క నాటినీ సంరక్షించి భవిష్యత్తులో వృక్షాలుగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో 24% అటవీ సంపద ఉందని ,జిల్లాలో నర్సాపూర్, వడియారం, పరికిబండ, మనోరాబాద్ అర్బన్ ఫారెస్ట్ పార్కులను హైలెట్ చేయడం జరుగుతుందన్నారు.ఈ ప్రాంతంలో ఉన్న ఫారెస్ట్ కు పిల్లలకు ప్రత్యేక టూర్ అరేంజ్ చేసి వారందరికీ జిల్లాలో అటవీ సంపద ఫారెస్ట్ పార్కులు మొక్కల వల్ల భావితరాలకు ఉపయోగం సంబంధిత విషయాలపై అవగాహన కల్పించాలన్నారు.జిల్లాలో అటవీ సంపదను పరిరక్షించడంలో అటవీశాఖ అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు.తెలంగాణ ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రత్నాక జోహారీ మాట్లాడుతూ జిల్లాలో వరల్డ్ ఎన్రోల్మెంట్ కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని మానవాళి మనుగడకు చెట్లే ప్రతిరూపంగా ఉంటాయన్నారు. విశాఖపట్నంలో సునామీ ఏర్పడినప్పుడు చెట్లు ఉన్న ప్రాంతాలలో దాని యొక్క తాకిడి చాలా తక్కువ మొత్తంలో ఉన్నది అంటే చెట్ల యొక్క ప్రాముఖ్యత తెలుసుకోవాలన్నారు. గ్రామీణ అభివృద్ధి శాఖ అటవీ శాఖ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## వాసవి మాత కు వాయినాలు సమర్పించిన ఆర్యవైశ్య మహిళలు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం నాడు అమ్మవారికి అధిక జ్యేష్ఠ మాస వాయనాలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి గాజులు, పసుపు కుంకుమ, వివిధ రకాల పండ్లు, పూలు, స్వీట్లు సమర్పించారు. లలితా సహస్ర నామ పారాయణ, విష్ణు సహస్ర నామ, వాసవి మాత పారాయణం, మణి ద్వీప వర్ణన గానం చేశారు. ఈ సందర్భంగా సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు రాధా దంపతులను వాసవి దేవాలయం కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు సింగిరికొండ రవీందర్, కార్యదర్శి ఈగ వెంకటేశ్వర్లు , ఆర్యవైశ్య ప్రముఖులు తాళ్లపల్లి రామయ్య, గుండా శ్రీధర్, చల్లా లక్ష్మయ్య, బిక్కుమల్ల కృష్ణ, రాచకొండ శ్రీనివాస్, తల్లాడ సోమయ్య, మిట్టపల్లి రమేష్, బెలిదె అంజయ్య, పసుపర్తి కృష్ణమూర్తి, దోగుపర్తి ప్రవీణ్, సోమ వెంకటేశ్వర్లు, సోమా ప్రవీణ్ కుమార్, జూలకంటి నాగరాజు, బజ్జూరి శ్రీనివాస్, వెంపటి శబరినాథ్, యామ సంతోష్, చిలుకల శ్రీనివాస్ , శ్రీరంగం రాము తదితరులు పాల్గొన్నారు. ఆలయంలో మినీ ఫంక్షన్ హాల్ విస్తరణ కు సహకరిస్తున్న దాత లకు కమిటీ సభ్యులు ధన్యవాదములు తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**: జిల్లా కలెక్టర్ అంకిత్**




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కల పెంపకం అత్యంత అవసరమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చుంచుపల్లి మండలం రుద్రంపూర్ వి.కే. సి.ఎం ప్రాంతంలో మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే పచ్చదనాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, జిల్లా అటవీ అధికారి కృష్ణ గౌడ్‌లు కలెక్టర్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

*** జిల్లా కలెక్టర్ కె.హరిత**

ప్రజా స్ఫూర్తి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా: ఈ నెల 12 నుండి 19వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తో కలిసి బడిబాట కార్యక్రమం నిర్వహణపై అన్ని ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, పాఠశాలలను విద్యార్థుల నమోదు 100 శాతం ఉండాలని, ఆ దిశగా విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని తెలిపారు. అంగన్వాడి లలో ఉన్న విద్యార్థి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉండాలని, ప్రాథమిక పాఠశాలలో ఉన్న విద్యార్థి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉండాలని, ఇందులో ఉన్న విద్యార్థి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు వెళ్లాలని, 10వ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరేలా పర్యవేక్షించాలని తెలిపారు. ఏ విద్యార్థి బడి బయట ఉండకూడదని, ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు పాఠశాల ప్రారంభమైన రోజునే పాఠ్యపుస్తకాలు, వర్క్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు, అల్పాహారం, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందని, విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. బడిబాట కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యులను చేయాలని, ఈ నెల 12 నుండి 19వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాలలో రోజుకు ఒక కార్యక్రమాన్ని నిర్వహించేలా కార్యచరణ అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సచ్చిదానంద చారి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నదీమ్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, అన్ని ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల అధికారులు పాల్గొన్నారు.

## మహిళలు, చిన్నారుల రక్షణకు శాఖల సమన్వయం అవసరం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజా స్ఫూర్తి : మహిళలు, చిన్నారులపై జరిగే హింస, వేధింపుల కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం, రక్షణ, పునరావాస సేవలు అందించేందుకు అన్ని శాఖల మధ్య సమన్వయం కీలకమని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో భరోసా కార్యక్రమానికి సంబంధించిన కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మహిళలు, చిన్నారుల సంక్షేమానికి సంబంధించిన వివిధ శాఖల అధికారులు పాల్గొని బాధితులకు వైద్య, న్యాయ, కౌన్సెలింగ్, పునరావాస సేవలను మరింత సమర్థవంతంగా అందించే చర్యలపై చర్చించారు. మహిళలు, చిన్నారులపై నమోదవుతున్న కేసుల్లో వేగవంతమైన దర్యాప్తు చేపట్టడంతో పాటు బాధితులకు అవసరమైన సేవలు అందించేందుకు రిఫరల్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఎస్పీ సూచించారు. భరోసా కేంద్రాల ద్వారా ఒకే వేదికపై అన్ని రకాల సహాయ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, కేసుల పరిష్కారంలో ప్రతి శాఖ సమయానుకూలంగా బాధ్యతలు నిర్వర్తించాలని పేర్కొన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నరేష్‌కుమార్, ఐసీపీఎస్ అధికారులు, చైల్డ్ లైన్ ప్రతినిధులు, సీడబ్ల్యూసీ, జేజేబీ సభ్యులు, డీఎల్ఎస్ఏ ప్రతినిధులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, వైద్య ఆరోగ్య శాఖ, మహిళాశిశు సంక్షేమ శాఖ అధికారులు, ఎస్ఈఆర్పీ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దర్యాప్తు అధికారులు, భరోసా ఎస్ఐ స్వప్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రేతలపై ఉక్కుపాదం

*** క్రిమినల్ కేసులతో పాటు పీడీ యాక్ట్ కింద చర్యలు : ఎస్పీ సంకీర్త్**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలు, నకిలీ ఎరువుల విక్రయాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో సీసీఎస్ ఎస్సై రమేష్, ఆర్ఎస్ఐ రాజేష్‌తో కలిసి సిబ్బంది జిల్లాలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణదారులకు నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాల నివారణపై అవగాహన కల్పించారు.ప్రత్యేకించి BG3 వంటి నిషేధిత పత్తి విత్తనాల విక్రయం పూర్తిగా చట్టవిరుద్ధమని ఎస్పీ తెలిపారు. రైతులను మోసం చేస్తూ నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలను అరికట్టేందుకు ప్రతి మండలంలో రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖల సమన్వయంతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు లైసెన్స్ కలిగిన దుకాణాల నుంచే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు లేదా ఎరువుల విక్రయాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

## గంజాయి సేవించే అనుమానిత ప్రాంతాల్లో అర్ధరాత్రి ప్రత్యేక తనిఖీలు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు చేపడుతున్న ప్రత్యేక కార్యాచరణలో భాగంగా, మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు ఆధ్వర్యంలో టౌన్ సీఐ రఘుపతి రెడ్డి, రూరల్ సీఐ అంజలి, 7 మంది ఎస్ఐలు, 40 మంది పోలీసు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు అర్ధరాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి.పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని నిర్మానుష్య ప్రదేశాలు, ఖాళీ మైదానాలు,చెట్ల పొదలు, రైల్వే ట్రాక్ పరిసరాలు,పార్కులు, విద్యాసంస్థల సమీప ప్రాంతాలు, యువకులు గుమిగూడే ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టి గంజాయి వినియోగంపై ఆరా తీశారు.బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న 25 మందిపై ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. అనుమానాస్పద 15 మంది వ్యక్తులకు గంజాయి టెస్టింగ్ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించారు.ఈ పరీక్షలో రిజల్ట్ నెగెటివ్ వచ్చినది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, ఐపీఎస్ మాట్లాడుతూ, గంజాయి విక్రయదారులు, సరఫరాదారులు, వినియోగదారులపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని తెలిపారు. గంజాయి యువత భవిష్యత్తును దెబ్బతీసే సామాజిక దురాచారమని, జిల్లాను పూర్తిగా గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందన్నారు. గంజాయి అలవాటుతో బాధపడుతున్న వారి కుటుంబ సభ్యులు జిల్లా పోలీసు హెల్ప్‌లైన్ 8712656999కు సమాచారం అందించాలని కోరారు

## రవాణా శాఖకు కొత్త సారథి.. కలెక్టర్‌ను కలిసిన వెంకన్న



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా రవాణా శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన వెంకన్న శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. భూపాలపల్లి జిల్లా రవాణా అధికారిగా విధులు నిర్వహించిన మహమ్మద్ సంధాని జగిత్యాల జిల్లాకు బదిలీ కాగా, ఆయన స్థానంలో జగిత్యాల జిల్లా నుంచి వెంకన్నను నియమించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా పరిపాలనతో సమన్వయంగా రవాణా శాఖ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే ములుగు జిల్లా నుంచి బదిలీపై వచ్చిన మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) శ్రీనివాస్ కూడా కలెక్టర్‌ను కలిసి మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంవీఐ సుందర్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి గ్రామస్తుల ఆర్థిక సహాయం



లింగాల ఘణపురం / ప్రజాస్ఫూర్తి:జిల్లా లోని లింగాల ఘణపురం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మంద్గు లోజు మహేష్ భార్య శారద ఇటీవల అకాల మరణం చెందడంతో వారి కుటుంబం తీవ్ర విషాదంలో మునిగి పోయింది. ఈ నేపథ్యంలో గ్రామ ప్రజలు మానవత్వాన్ని చాటుతూ స్పందిం చి బాధిత కుటుంబానికి రూ.28,800 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడు తూ, కష్టకాలంలో కుటుంబానికి ధైర్యం చెప్పడంతో పాటు ఆర్థికంగా అండగా నిలవడం గ్రామ ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న తోటి మనిషికి చేయూతనివ్వడం గొప్ప సామాజిక బాధ్యత అని అన్నారు. సహాయం చేసి న గ్రామ ప్రజలందరికీ మహేష్ కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవతా విలువలు, పరస్పర సహకార భావనను మరింత బలోపేతం చేస్తాయని అభిప్రాయపడ్డా రు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విష్ణు కుమార్, ఉప సర్పంచ్ ఎం.డి జాంగిర్, వార్డు సభ్యుడు గుడిగంటి శ్రీకాంత్, కా రోబార్ ఆంజనేయులు, ఫీల్డ్ అసిస్టెంట్ సిద్దిరాజు, ఎం.డి అంకుష్, వడ్యానం బాలు, కందుల నర్సంగరావు, తుంగ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## వర్షా కాలానికి ముందస్తు చర్యలు చేపట్టాలి

**: కౌన్సిల్ సభ్యుల సూచనలు.**

జనగామ, ప్రజాస్ఫూర్తి : వర్షాకాలాన్ని దృష్టి లో ఉంచుకుని డ్రైనేజీ, వరద ని వారణ, పారిశుధ్య సమస్యల పై పట్టణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో స భ్యులు పలు కీలక సూచనలు చేశ రు. పట్టణం లోని లోతట్టు ప్రాంతాలు వర్షా ల సమయంలో రోజుల తరబడి మురుగు నీటిలో మునిగిపోతున్నాయని, దీని వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రైనే జీ వ్యవస్థను తక్షణమే మెరుగుపరిచి పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. కోతులు,వీధి కుక్క లు, పందుల సమస్య పై ప్రత్యేక చర్య లు చేపట్టాలని, మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచిం చారు.దోమల నివారణ కు ఫాగింగ్, బయోటెక్ స్ప్రేలు, ఆయిల్ బాల్స్ విని యోగాన్ని పెంచి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించ కుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలి పారు. తడి, పొడి చెత్త వేర్వేరు గా సేక రించేలా ప్రతి ఇంటికి చెత్తబుట్టలు పం పిణీ చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగాన్ని అరికట్టడం, రోడ్లు, మురికి కాలువల నిర్మాణ పనులను చేపట్టడం,వార్డుల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించా లని సభ్యులు కోరారు. పట్టణ పారిశు ధ్య నిర్వహణకు ప్రస్తుతం ఉన్న మున్సి పల్ కార్మికుల సంఖ్య సరిపోవడం లేదని, అదనపు కార్మికులను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు.

## డెల్టా హైస్కూల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : అత్యాధునిక అన్ని హంగులతో ఏర్పాటు చేయబడిన డెల్టా హై స్కూల్ విద్యార్థులు చదువులో రాణించడానికి ఎంతో ఉపయోగపడుతుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వలిగొండ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన డెల్టా హై స్కూల్ ను ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిజిటల్ క్లాసులు, ప్రొజెక్టర్ సహాయంతో పాఠాలు బోధించడం విద్యార్థులకు త్వరగా అర్థమయ్యే రీతిలో ఈ ప్రొజెక్టర్లు ఉపయోగపడతాయని అన్నారు. అంతేకాకుండా ఇదివరకు ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు డాక్టర్లు గాను అలాగే విదేశాలలో సైతం మంచి మంచి విభాగాలలో ఉన్నత స్థితిలో ఉన్నారని తెలిపారు. 17 సంవత్సరాల నుండి ఈ పాఠశాలను అగ్రగామిలో నడిపిస్తున్న పాఠశాల కరస్పాండెంట పబ్బు శ్రీధర్ నుఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అభినందించారు. అలాగే భవిష్యత్తులో కూడా మరింత పాఠశాల అభివృద్ధి చెందాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బీమా నాయక్, తదితరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

# పాలేరు నియోజకవర్గంలో మంత్రి మాట నిలబెట్టుకోవాలి

*** సిపిఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్..**



కూసుమంచి ప్రజా స్ఫూర్తి : రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పిన రాష్ట్ర రెవెన్యూ ,గృహ నిర్మాణాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాలేరు నియోజకవర్గంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి మాట నిలుపుకోవాలని సిపిఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని పద్మా రెడ్డి భవనంలో సిపిఎం సీనియర్ నాయకులు శీలం గురుమూర్తి అధ్యక్షతన జరిగిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో ప్రతి పేదవాడికి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముందుగా పాలేరు నియోజకవర్గంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి మాట నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లను కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికే ఇండ్లు కేటాయిస్తూ... అర్హులను పక్కన పెడుతున్నారని, మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో మొత్తం అవినీతిమయం, డబ్బులు ఇచ్చిన వారికి, లేదా కాంగ్రెస్ పార్టీ వారికి అర్హత లేకున్నా ఇందిరమ్మ ఇండ్లను ఇచ్చారని ఆరోపించారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో మాత్రం అలా జరగకుండా నిష్పక్షపాతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పిన రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. పాలేరు నియోజకవర్గంలో రెండో విడత ఇందిరమ్మండ్ల ఎంపికలో అనర్హులు, అర్హత లేకున్నా కాంగ్రెస్ పార్టీ అయ్యుంటే వారికే ఇల్లు కేటాయిస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని, ఈ రెండో విడతలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించి పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. అనర్హులకు ఇల్లును కేటాయించి, అర్హులను పక్కన పెడితే మాత్రం పాలేరు డివిజన్ వ్యాప్తంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు,నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లెల సన్మతరావు,సిపిఎం మండల కార్యదర్శి తోటకూర రాజశేఖర్, పాలేరు డివిజన్ కమిటీ సభ్యులు బిక్కసాని గంగాధర్,మండల కమిటీ సభ్యులు చీర్ల రాధాకృష్ణ,చిట్టూరి వెంకన్న, పందిరి వీరారెడ్డి, ఎర్రబోయిన సురేష్, కర్ణబాబు, జవ్వాజి శ్రీను, పాల్గొన్నారు.

## ఉపాధి పనుల్లో కూలీకి గాయం



మొగుళ్లపల్లి, ప్రజాస్ఫూర్తి :మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీ గజ్జి ఐలయ్యకు శుక్రవారం ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ఎడమ కాలి పాదానికి గడ్డపార తగిలి స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన ఫీల్డ్ అసిస్టెంట్ అంబాల సదానందం వెంటనే అధికారులకు సమాచారం అందించారు. ఎంపీడీవో, ఏపీవో సూచనల మేరకు క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అప్పగింత



మహబూబాబాద్,ప్రజా స్ఫూర్తి : మహబూబాబాద్ టౌన్ పీఎస్ పరిధిలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ ను సీఇఐఆర్, సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి బాధితునికి అప్పగించినట్లు మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి తెలిపారు. పోగొట్టుకున్న, చోరికి గురైన మొబైల్ ఫోన్లను బాధితులు వెంటనే సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. మొబైల్ రికవరీ టెక్నికల్ సిబ్బంది కానిస్టేబుల్స్ సురేందర్,భవానిలను సిఐ అభినందించారు.

## హైటెక్స్ లో థ్రెడ్ పోచంపల్లి చేనేత ప్రదర్శన. ప్రారంభం

*** ప్రారంభించిన మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల, ఎంపీ చామల, ఎమ్మెల్యే కుంభం**



*భువనగిరి, ప్రజాస్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి నేతృత్వంలో హైదరాబాద్ హైటెక్స్ హాల్ నెంబర్ 4 లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ స్థాయి థ్రెడ్ పోచంపల్లి చేనేత ప్రదర్శన మరియు విక్రయ కేంద్రాన్ని రాష్ట్ర రోడ్లుభవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార మరియు చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గజం అంజయ్య పాల్గొని ప్రదర్శనలోని చేనేత స్టాళ్లను సందర్శించారు. ఎమ్మెల్యే కుంభం మాట్లాడుతూ భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని చేనేత కుటుంబాల అభివృద్ధికి తాము నిరంతరం కృషి చేస్తామని, హైదరాబాద్ నగర ప్రజలు, చేనేత ప్రియులు జూన్ 5 నుండి జూన్ 7 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించి, వస్త్రాలను కొనుగోలు చేసి నేతన్నలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హ్యాండ్లూమ్ చైర్మన్ వెంకరమణ ,పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశం, ప్రజాప్రతినిధులు, చేనేత జౌళి శాఖ , ఇతర ప్రభుత్వ ఉన్నతాధికారులు , చేనేత సహకార సంఘాల ప్రతినిధులు, నేతన్నలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మైనంపల్లి చొరవతో గాంధీనగర్‌కు మళ్లీ నీటి వెలుగు



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : మౌలాలి గాంధీనగర్‌లో గత కొంత కాలంగా బోరు చెడిపోవడంతో కాలనీవాసులు తీవ్ర తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను స్థానిక కాంగ్రెస్ నాయకులు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి కొత్త బోరు మోటర్, సర్వీస్ వైర్, పైపులు తదితర అవసరమైన సామగ్రిని మంజూరు చేయించారు. గురువారం వాటర్ వర్క్స్ సిబ్బంది కొత్త బోరు మోటర్‌ను విజయవంతంగా బిగించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో కాలనీవాసుల నీటి సమస్యకు తక్షణ ఉపశమనం లభించింది. ఈ కార్యక్రమంలో 186 డివిజన్ అధ్యక్షులు పోతుల వినోద్ యాదవ్, వర్కింగ్ అధ్యక్షులు వెంకన్న, ఫెడరేషన్ అధ్యక్షులు చుంకు శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు యూసుఫ్ భాయ్, సత్తన్న, మంద భాస్కర్ మాదిగ చందు (చంద్రకాంత్), షకీల్, దేవసహాయం, అత్తర్ సాయి కుమార్, ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే కాలనీ అధ్యక్షులు బుడంపల్లి శ్రీనివాస్ గౌడ్, రవి, కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, సాదిక్, గున్నాల ప్రవీణ్ గౌడ్, సుధాకర్, శివ గౌడ్, సాయి, సందీప్, రాము, సిద్ధులు, రాజు, బిక్షపతి, లింగేష్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గాంధీనగర్ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపిన మైనంపల్లి హనుమంతరావు కు సంబంధిత అధికారులకు మరియు కాంగ్రెస్ నాయకులకు కాలనీవాసులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## కోర్టు డ్యూటీ అధికారులు పాత్ర కీలకం: ఎస్పీ రోహిత్‌రాజు



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: నిందితులకు శిక్ష పడేలా చేయడంలో కోర్టు డ్యూటీ అధికారుల పాత్ర కీలకమైనదని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోగల కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, కోర్టు డ్యూటీ అధికారులతో శుక్రవారం ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కోర్టు డ్యూటీ అధికారులకు కేసుల పట్ల పూర్తి అవగాహన ఉండాలన్నారు. బాధితులకు న్యాయం జరిగే విధంగా సమగ్రంగా కేసులను పర్యవేక్షించాలని చెప్పారు. సమన్స్, వారెంట్ల జారీలో జాప్యం లేకుండా సకాలంలో సాక్షులకు, నిందితులకు అందజేయాలని తెలిపారు.. కోర్టులో విచారణ నడిచే సమయంలో సాక్షులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూసుకోవాలని, సాక్షులకు కేసు వివరాల పట్ల అవగాహన కల్పించాలని వివరించారు. కేసులకు సంబంధించిన సీజ్ చేసిన ప్రాపర్టీని ఎప్పటికప్పుడు కోర్టులో హాజరు పరచాలన్నారు. కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేస్తూ బాధ్యతాయుతంగా పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్లు, కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

## అనురాగ్ నల్గొండ నైట్స్ జెర్సీ ఆవిష్కరణ

*** గ్రామీణ క్రికెట్ ప్రతిభఅభివృద్ధికి అనురాగ్ యూనివర్సిటీ.**




నల్గొండ, ప్రజాస్ఫూర్తి : టీజీ20 లీగ్లో నల్గొండ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అనురాగ్ నల్గొండ నైట్స్ జట్టు జెర్సీని శుక్రవారం నల్గొండలోని ఎంఎన్ఆర్ కన్వెన్షన్లో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన 25 30 క్రికెట్ అకాడమీల నుంచి 700 మందికి పైగా యువ క్రికెటర్లు, 60 మందికి పైగా కోచ్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన అనురాగ్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ స్ట్రాటజీ అనురాగ్ పల్లా, గ్రామీణ ప్రాంతాల నుంచి వెలుగులోకి వస్తున్న క్రికెట్ ప్రతిభను ప్రోత్సహించేందుకు అనురాగ్ యూనివర్సిటీ దీర్ఘకాలిక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. యువ క్రీడాకారులకు కోచింగ్, శిక్షణా సదుపాయాలు, ప్రాక్టీస్ మ్యాచ్లు, టాలెంట్ ఐడెంటిఫికేషన్ అవకాశాలను అందిస్తూ వారి అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఇది కేవలం ఒక సీజన్ కే పరిమితం కాని, రాబోయే ఐదేళ్లపాటు కొనసాగనున్న దీర్ఘకాలిక కార్యక్రమం అని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని పట్టణాల్లో టాలెంట్ హంట్లు, ఇంటర్ అకాడమీ టోర్నమెంట్ల నిర్వహణపై కోచ్లు, విద్యార్థులు చేసిన సూచనలను స్వాగతిస్తూ వాటిని అమలు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనురాగ్ నల్గొండ నైట్స్ హెడ్ కోచ్ డి.బి. రవితేజ యువ ఆటగాళ్లతో ప్రత్యేకంగా మమేకమై ఫిట్నెస్, నైపుణ్యాల అభివృద్ధి, క్రమశిక్షణతో కూడిన శిక్షణ, ఆటలో నిరంతర మెరుగుదల వంటి అంశాలపై విలువైన సూచనలు చేశారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫిట్నెస్కు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ ఆటగాళ్లను ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో జట్టు అసిస్టెంట్ కోచ్ రోనాల్డ్ రోడ్రిగ్స్, ఫిజియో, ట్రైనర్, మేనేజర్, మెంటర్ తదితర సపోర్ట్ స్టాఫ్ను పరిచయం చేశారు. అనంతరం అనురాగ్ నల్గొండ నైట్స్ అధికారిక జెర్సీని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమం ద్వారా అనురాగ్ యూనివర్సిటీ మరియు ప్రాంతీయ క్రికెట్ వర్గాల మధ్య బలమైన భాగస్వామ్యానికి శ్రీకారం చుట్టబడింది. యువ క్రికెటర్లకు మరిన్ని అవకాశాలు కల్పిస్తూ ప్రాంతీయ క్రికెట్ అభివృద్ధికి ఈ కార్యక్రమం కీలకంగా నిలవనుందన్నారు


## బర్డ్ వాక్ కార్యక్రమం విజయవంతం చేయాలి

*** జిల్లా అటవీ శాఖ అధికారి జోజీ**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: ప్రకృతి పరిరక్షణ, పక్షుల సంరక్షణపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో నిర్వహించబడే బర్డ్ వాక్ కార్యక్రమంను విజయవంతం చేయాలన్నారు. శనివారం జరగబోయే బర్డ్ వాక్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్,జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు. పోచారం ల్యాండ్‌స్కేప్ యొక్క గొప్ప పక్షి వైవిధ్యం, సహజ వారసత్వం పట్ల ప్రశంసను ప్రోత్సహించడానికి, 06.06.2026 తేదీన ఉదయం 6.30 నుండి 8.00 గంటల వరకు పోచారంలోని డిబిసిలో నిర్వహించబడే బర్డ్ వాక్‌లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.పోచారం జలాశయం , అభయారణ్యం చుట్టూ ఉన్న పోచారం ప్రాంతం, వలస నీటి పక్షులు, కొంగలు, ఐబిస్‌లు, బాతులు అనేక అటవీ ప్రాంతాలతో సహా విభిన్న పక్షి జీవనానికి ప్రసిద్ధి చెందిందన్నారు. ఇది ఒక ముఖ్యమైన పక్షి వీక్షణ గమ్యస్థానంగా నిలుస్తుందనీ ప్రకృతి ప్రేమికులు, విద్యార్థులు, అధికారులు పాల్గొని వివిధ రకాల పక్షులను విక్షించాలని , పక్షుల జీవన విధానం, వలస పక్షుల ప్రాముఖ్యత, పర్యావరణ సమతుల్యతలో వాటి పాత్ర గురించి ,పక్షుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా చెట్లు నాటడం, నీటి వనరులను కాపాడడం, పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచడం అవసరం అన్నారు, ప్రకృతిని దగ్గరగా ఆస్వాదిస్తూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవడానికి బర్డ్ వాక్ వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.

## అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లులు ఇవ్వకుంటే ఊరుకునేదే లేదు




ప్రజాస్ఫూర్తి , జన్నారం : రెండవ విడతలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లులు ఇవ్వకుంటే ఊరుకునేదే లేదని మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తౌటు సంజీవ్ అన్నారు.శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో జన్నారం మండలంలోని రేండ్లగూడ గ్రామానికి చెందిన కొందరికి ఇందిరమ్మ ఇల్లులు మంజూరు కాగా, కొందరు అధికారులు,రాజకీయ నాయకులు వాటిని వేరే వాళ్లకు అమ్ముకున్నారని ఆరోపించారు. ఈసారి కూడా అలా చేస్తే ఊరుకునేది లేదని ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసనకు దిగుతామని హెచ్చరించారు.

## పర్యావరణంలో ఉన్నటువంటి కాలుష్యాన్ని నివారించాలంటే ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి



నల్లగొండ , ప్రజాస్ఫూర్తి : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక నాగార్జున కళాశాల మైదానంలో నాగార్జున కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాగార్జున కళాశాల వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బండారు ప్రసాద్ తమ తల్లి కీర్తిశేషులు శ్రీమతి బండారు వెంకటమ్మ జ్ఞాపకార్థం వాకర్స్ సభ్యులకు బట్ట సంచులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ పుల్లారావు మాట్లాడుతూ పర్యావరణంలో ఉన్నటువంటి కాలుష్యాన్ని నివారించాలంటే ప్లాస్టిక్ వాడకం,ఇందనం వాడకం తగ్గించాలని మొక్కలు నాటడం పరిరక్షించుకోవడం, పరిసరాలు ను శుభ్రపరచుకోవటం,, వ్యర్థ పదార్థాలను ఎప్పటికప్పుడు దారి మళ్ళించడం, ద్వారా అది సాధ్యమని తెలిపినారు. భారత ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి వ్యక్తి తమ తల్లి పేరు మీద ఒక మొక్కను నాటాలని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని బండారు ప్రసాద్ పేర్కొన్నారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులందరూ ఈ కార్యక్రమాన్ని ఆచరణలో పెట్టాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో నాగార్జున కళాశాల వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ పుల్లారావు , బి.ఎస్. ఆర్., వంగాల అనిల్ రెడ్డి, పోతపాక లింగస్వామి , గుర్రం వెంకన్న , రావిరాల వెంకన్న , చింతపల్లి వెంకన్న , మిర్యాల యాదగిరి, విజయభాస్కర్ రెడ్డి, ప్రముఖ పర్యావరణవేత్త మనీ రాజు , నిఖిల్, సరోజ,తదితరులు పాల్గొన్నారు.

## వలిగొండ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పి అక్షాంశ్ యాదవ్



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : వలిగొండ పోలీస్ స్టేషన్ ను శుక్రవారం వార్షిక తనిఖీలో బాగంగా జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఐపీఎస్ తనిఖీ చేసి ముందుగా పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తునా సిబ్బంది యొక్క యూనీఫాం దరించే విదానం మరియు వారి యొక్క వ్యక్తి గత సామగ్రి ఉండే పెట్టెను తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాన్ని సందర్శించి మొక్కలు నాటారు. పోలీస్ స్టేషన్ లోపల జనరల్ డైరీ పరిశీలించిన తర్వాత హెల్ప్ డెస్క్ విదులు అడిగి తెలుసుకున్నారు. సెక్షన్ ఇన్చార్జి వద్ద గల జనరల్ డైరీ ని తనిఖీ చేసి వారి యొక్క విధులను గురించి విచారించారు,కోర్టు రికార్డు గది తనిఖీ చేసి ఎవిడెన్స్ ప్రాపర్టీ ని ఆర్డర్ లో పెట్టుకోవాలి అని ఆదేశించారు. ఈ పెట్టి ,పిటిషన్ పెండింగ్ ,రెజిస్టర్డ్ పిటిషన్ లను ఎప్పటికీఅప్పుడు సంబందిత రికార్డు లలో పొందుపరచాలని ఆదేశించారు CCTNS ,CISR,పోర్టల్ ల పనితీరును పరిశీలించారు, సైబర్ నేరాల వివరాల యొక్క పాత కేసుల వివరాలను కంప్యూటరు లో తనిఖీ చేశారు, లాక్ అప్ రూమ్ తనిఖీ చేసి వాటిలో గల సీసీటీవీల పనితీరు అడిగి తెలుసుకున్నారు. రౌడీ షీటర్ ల యొక్క రికార్డు లను పరిశీలించి వారి యొక్క ప్రవర్తనల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ బయట గల రికవరీ వాహనాల ను పరిశీలించి వాటికి సంబందించిన క్రైమ్ నెంబర్ ని వాటిపైన వేసి వాటి యొక్క నేరాల నెంబర్ ఆధారంగా ఆర్డర్ లో పెట్టాలి అని ఆదేశించారు. ఈ తనిఖీలో జిల్లా ఎస్పీ ఆద్వర్యంలో చౌటుప్పల్ డివిజన్ డిఎస్పి మధుసూదన్ రెడ్డి , సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఎస్సై యుగేందర్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత

* బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: జూన్ 5 తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు శుక్రవారం కూసుమంచి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ లోహిత గారితో కలిసి మొక్కలు నాటడం జరిగినది. పర్యావరణం పరిరక్షణ మన అందరి బాధ్యత దీనితో పాటు పర్యావరణాన్ని రక్షించుకోవడం భావితరాలకు ఒక వరం లాంటిది కావున ప్రతి ఒక్కరు కూడా ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని రక్షించుకుందాం. ప్రకృతిని కాపాడడం అంటే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన జీవనాన్ని అందించటమే. ఈ కార్యక్రమంలో స్థానిక 5 వార్డు సభ్యులు శ్రీమతి మంద నవ్య చంద్రశేఖర్ గౌడ్, ఆసుపత్రి సిబ్బంది దామళ్ళ అనిల్, కోటి, మంద చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ మున్సిపాలిటీకి రాష్ట్ర స్థాయి అవార్డు




హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హైదరాబాద్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం2026 సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో హుస్నాబాద్ పురపాలక సంఘం ప్రతిష్టాత్మక "బెస్ట్ మున్సిపాలిటీ ఇన్ వేస్ట్ మేనేజ్‌మెంట్" అవార్డును అందుకుంది. "క్లైమేట్ యాక్షన్" థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా హుస్నాబాద్ పురపాలక సంఘ చైర్‌పర్సన్ దండి లక్ష్మీ, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, పర్యావరణ అధికారి రవికుమార్ అవార్డును స్వీకరించారు. పట్టణంలో ఘన వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రత పర్యావరణ పరిరక్షణ చర్యలు ప్రజల్లో అవగాహన కార్యక్రమాల నిర్వహణలో చూపిన ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా అవార్డు అందుకోవడం హుస్నాబాద్ పట్టణానికి గర్వకారణమని, భవిష్యత్తులో మరింత మెరుగైన పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను చేపడతామని అధికారులు తెలిపారు.

## జడ్చర్ల సీఎం సభకు కేశంపేట నుంచి భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు



ప్రజాస్ఫూర్తి ,షాద్నగర్ : జడ్చర్లలో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు కేశంపేట మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. కేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో, మాజీ జెడ్పీటీసీ తండ్ర విశాల శ్రావణ్ రెడ్డి నేతృత్వంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులలో సభకు బయలుదేరారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు సంఘీభావం వ్యక్తం చేశారు. సభకు వెళ్లిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మహిళలు, యువత మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రైవేటు విద్యాసంస్థల బస్సుల తనిఖీ



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సి. స్వప్న ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలకు సూచించారు. ఈ నేపథ్యంలో షాద్‌నగర్ పరిధిలోని పలు ప్రైవేటు పాఠశాలల బస్సులను అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా బస్సుల ఫిట్‌నెస్, బ్రేకులు, టైర్లు, అత్యవసర ద్వారాలు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అగ్నిమాపక పరికరాలు తదితర భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. విద్యార్థులను రవాణా చేసే వాహనాలు పూర్తిస్థాయి ఫిట్‌నెస్ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని స్వప్న హెచ్చరించారు. పాఠశాలల యాజమాన్యాలు బస్సుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రభుత్వం నిర్దేశించిన రవాణా భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విద్యార్థుల సురక్షిత ప్రయాణమే ప్రధాన లక్ష్యమని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### పంట అవశేషాలు తగలబెట్టడం ద్వారా

# కలిగే అనర్థాలపై కళాజాత బృందాల ద్వారా అవగాహన

* కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సతీష్



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి : కూసుమంచి మండలంలోని కూసుమంచి గ్రామంలో పంట అవశేషాలు తగలబెట్టడం ద్వారా కలిగే అనర్థాలను కళాజాత బృందాల వారి ద్వారా అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సతీష్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ పంట అవశేషాలను తగలబెట్టడం ద్వారా కలిగే అనర్థాలు, వాటిని ఏ విధంగా భూమిలో కలియదున్నాలి అనే అంశంపై రైతులకు వివరించడం జరిగింది. అనంతరం నిషేధిత హెచ్ టి పత్తి సాగు, విత్తనాల కొనుగోలులో తీసుకోవలసిన జాగ్రత్తలు, విచక్షణా రహితంగా ఎరువులను వాడటం వలన కలిగే అనర్థాలు , నానో ఎరువుల వినియోగం , నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించడం జరిగింది. గ్రామాలలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు కానీ, మరెవరైనా వ్యక్తులు గాని విత్తనాలను అనుమతి లేకుండా విక్రయిస్తున్నట్లయితే వ్యవసాయ శాఖ వారికి వెంటనే సమాచారం అందించాలని తెలియజేశారు . అనంతరం మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి మాట్లాడుతూ ఈ వానాకాలం ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా పడే అవకాశం ఉందని కావున రైతులు వరికి బదులు అపరాలు మరియు పప్పు దినుసులు సాగు చేసుకోవడం శ్రేయస్కరమని సూచించారు. జనము, జీలుగ వంటి పచ్చి రొట్ట ఎరువులు కూసుమంచి, జకేపల్లి మరియు చేగొమ్మ సొసైటీలలో మరియు ఆగ్రో రైతుసేవ కేంద్రాలలో రైతులకు 50% సబ్సిడీలో అందుబాటులో ఉన్నాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం తురకగూడెం గ్రామంలో రైతుల అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జానీ మరియు రైతులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు

## మంజూరు చేయాలని వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన





ప్రజాస్ఫూర్తి , జన్నారం : ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ జన్నారం గ్రామ పంచాయతీ పరిధికి చెందిన కట్టెకోల రాములు శుక్రవారం రోజున వాటర్ ట్యాంక్ పైకి ఎక్కి నిరసన తెలిపారు. తాను ఎస్సీ దళిత కుటుంబానికి చెందిన నిరుపేదను అని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని రాములు డిమాండ్ చేశారు. పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. రాములుతో మాట్లాడి అతని సమస్యను పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పోలీసుల హామీతో రాములు వాటర్ ట్యాంక్ నుంచి కిందికి దిగి వచ్చాడు. అనంతరం గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శితో పోలీసులు చర్చించారు. రాములు దరఖాస్తును పరిశీలించి అర్హత ఉంటే మంజూరు చేయాలని సూచించారు. ఇలాంటి సమస్యలు ఉంటే నేరుగా అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని, ప్రాణాలకు హాని కలిగేలా నిరసనలు చేయవద్దని పోలీసులు సూచించారు.

## ఈశ్వర్ కాలనీలో భక్తిశ్రద్ధలతో పోచమ్మ తల్లి పూజలు

* 33 రకాల నైవేద్యాల సమర్పణ
* వరాల పోచమ్మ తల్లి అనుగ్రహం అందరి పై ఉండాలి



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : పట్టణంలోని 7వ వార్డు అయినా స్థానిక ఈశ్వర్ కాలనీ, భగత్ సింగ్ కాలనీ, అనుబంధ కాలనీలో వెలిసిన శ్రీ వరాల పోచమ్మ తల్లి ఆలయంలో అధిక జ్యేష్ఠ మాసం పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. పోచమ్మ తల్లి అనుగ్రహం అందరిపై ఉండాలని కాంక్షిస్తూ కాలనీ వాసులు ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. ఉదయం నుంచే భక్తజనులు ఆలయానికి చేరుకుని లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రంగా 33 రకాల నైవేద్యాలను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో కాలనీ వాసులు, పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ప్రాంగణమంతా భక్తుల రాకతో, ఆధ్యాత్మిక శోభతో విలసిల్లింది. ఈ కార్యక్రమంలో దేవాలయం అధ్యక్షుడు మేడిగ పెంటయ్య, డిజిటల్ మల్లేష్, పడకండి శ్రీశైలం, బీజేపీ భాస్కర్, దర్శన్, శివ, నీమూరి, శివ నాయక్, పోలేరాజు, మురళి, కుమ్మరి శ్రీశైలం, కాలనీ మహిళలు శైలజా, హైమావతి, ప్రమీల, శిరీష, రజిత, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

* హుస్నాబాద్ కోర్టు జడ్జిలు బి. రేవతి, ఈ. ప్రమిద



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని హుస్నాబాద్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి. రేవతి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఈ. ప్రమిద పిలుపునిచ్చారు. జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహణపై హుస్నాబాద్ కోర్టు ప్రాంగణంలో శుక్రవారం పోలీసు శాఖ అధికారులు, బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి బి. రేవతి మాట్లాడుతూ రాజీకి వీలున్న కాంపౌండబుల్ కేసులన్నింటినీ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకొని సమయం, ధనం ఆదా చేసుకోవాలని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని కోరారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోర్టు ఆవరణలో జడ్జిలు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జడ్జిలు సూచించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిని మల్లేశం, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రాజశేఖర్ రెడ్డి, పీపీ ఎం.కె. నాగరాజ్, హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట, బెజ్జంకి పోలీస్ స్టేషన్ల ఎస్సైలు పి. లక్ష్మారెడ్డి, పి. అభిలాష్, ప్రశాంత్, తిరుపతి, సీనియర్ న్యాయవాదులు ఒగ్గోజు సదానందం, కన్నోజు రామకృష్ణ, జె. కిరణ్ కుమార్, ఉప్పరపల్లి సంపత్, దీకొండ ప్రవీణ్, విశ్వతేజ్, సాయికుమార్ కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కోహెడలో ఫ్రూట్ మార్కెట్ శంకుస్థాపనకు ఏర్పాట్లు.. పరిశీలించిన మంత్రి తుమ్మల

హైదరాబాద్: కోహెడలో పండ్ల మార్కెట్ నిర్మాణానికి శనివారం సాయంత్రం 5గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సీఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర రైతుల అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ సదుపాయాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మిస్తామని చెప్పారు. మార్కెట్ కోసం 239 ఎకరాలు ఇచ్చిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు. పశ్చిమాసియా యుద్ధం వల్ల ఎరువుల కొరత వచ్చింది. అంతర్జాతీయ పరిస్థితుల వల్ల వ్యవసాయరంగంలో కొన్ని సమస్యలు వస్తున్నాయి. ఇటీవల కేంద్రప్రభుత్వం పత్తి, పామాయిల్ దిగుమతిపై సుంకాలు తగ్గించింది. దిగుమతి సుంకాలు తగ్గించడం వల్ల మనదేశంలోని రైతులకు నష్టం కలుగుతోంది. పామాయిల్, పత్తి తక్కువ ధరకు వస్తున్నాయని వ్యాపారులు విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటారు. డీజిల్ సరఫరాల సరిగా లేకపోవడం వల్ల ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.లక్ష కోట్లు జమ చేసింది'' అని మంత్రి తెలిపారు.

## ఘనంగా అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం



ప్రజాస్ఫూర్తి, జన్నారం : అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ సందర్భంగా శుక్రవారం రోజున జన్నారం రేంజ్ అధికారి బాబా ఖాదర్ వలీ ఆధ్వర్యంలో ఈఈసి నుండి గోండు గూడ గేట్ నెంబర్ వన్ వరకు, ఇందనపల్లి రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి, రేంజ్ కార్యాలయ ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను వారు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని, ప్లాస్టిక్ వాడటం వలన ఆరోగ్యానికి హానికరమని అన్నారు. ప్లాస్టిక్ భూమిలో కరగడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుందని, వాటిని తిని జంతువులు పక్షులు, పశువులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చినప్పుడు విషపూరిత వాయువులు విడుదలై మానవ ఆరోగ్యానికి హానికరం చేస్తాయని అన్నారు. కావున ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టడానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కు దూరంగా ఉండి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. రానున్న వినాయక చవితికి కూడా పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినాయక విగ్రహాలను కాకుండా మట్టితో తయారుచేసిన గణపతి పూజించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్.ఎస్.ఓ భోజ్య నాయక్, బీట్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలి

* సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య గౌడ్




గరిడేపల్లి ,ప్రజాస్ఫూర్తి : పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని , ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని గరిడేపల్లి గ్రామ సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య గౌడ్ అన్నారు. గరిడేపల్లి మండలంలోని గరిడేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ గ్రామ సభలో సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య గౌడ్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడితే ముందు భవిష్యత్తులో రాబోయే తరానికి ఉపయోగపడుతుందన్నారు. గ్రామ ప్రజలందరూ మొక్కలు నాటాలని చెప్పినారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాతంగి సంజీవ పంచాయతీ కార్యదర్శి గుగులోతు నాగేశ్వరావు ఏఎన్ఎం కవిత వార్డ్ మెంబర్లు కర్నే అరుణ మోదాల అంజయ్య కొత్తపల్లి వెంకన్న పిట్ట ధనమ్మ కాసాని మధు మామిడి సీత అంగన్వాడీ టీచర్స్ సరిత శ్రీలక్ష్మి ధనమ్మ మేరమ్మ మంగమ్మ వివో ఏలు స్రవంతి కమల ఫీల్డ్ అసిస్టెంట్ మేకపోతుల సరిత ఆశా కార్యకర్తలు ఉమా సైదమ్మ ఉపేంద్ర అంజమ్మ గ్రామపంచాయతీ బిల్ కలెక్టర్లు వెంకన్న నర్సిరెడ్డి సిబ్బంది వెంకటరెడ్డి లక్ష్మి సైదులు మౌలానా ఆంజనేయులు నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

: బస్వ లక్ష్మీ నర్సయ్య



జనగామ, ప్రజాస్ఫూర్తి : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన మొక్కల నాటే కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వ లక్ష్మీ నర్సయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్లాస్టిక్ నిర్మూలనతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే రాజా సింగ్ వ్యాఖ్యలకు నిరసనగా ముస్లింల ఆందోళన



జనగామ, ప్రజాస్ఫూర్తి : గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ ముస్లిం సమాజం పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ పట్టణం లోని ముస్లిం డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం శాంతి యుతం గా నిరసన వ్యక్తం చేశారు. జుమా నమాజ్ అనంతరం లక్ష్మీబాయి కుంట గేట్ సమీ పంలోని ఏక్‌మినార్ మసీదు వద్ద జరిగిన ఈ నిరసనలో వందలాది మంది ముస్లింలు పాల్గొని "అరెస్ట్ రాజా సింగ్" అని రాసిన ప్లకార్డులు ప్రదర్శించారు. ముస్లిం డెవలప్‌మెంట్ కమిటీ జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ మహమ్మద్ జమాల్ షరీఫ్ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజా సింగ్ తన వ్యాఖ్యలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, ఆయనపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జమాల్ షరీఫ్ మాట్లాడుతూ, రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన గౌరవాన్ని కల్పించిందని, ప్రజాప్రతినిధులు మత విద్వేషాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. అనంతరం నిరసనకారులు జనగామ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ ఆరిఫ్, ఇక్బాల్, నాహిద్, ఇస్మాయిల్, అఫ్జల్, రహీం, యాకూబ్, సల్మాన్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్ తరాల కోసం పచ్చదనం పెంచాలి

* ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కల పెంపకాన్ని ఉద్యమంగా తీసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కేంద్రంలోని మైసమ్మ ఆలయం సమీపంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పౌరుడు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా భావించాలని అన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో, వర్షపాతం పెరగడంలో చెట్ల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రెసిడెన్షియల్ స్కూల్ లో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

* జిల్లా సందీప్ కుమార్ ఝా.

జనగామ,ప్రజాస్ఫూర్తి : జిల్లాలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ (యూ ఆర్ఎస్) లో 2026-27 విద్యా సంవ త్సరానికి ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయ నున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. అర్హులైన అ భ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. అకౌంటెంట్, అసిస్టెంట్ కుక్, ప్యూన్ / అటెండర్ పోస్టులకు ఒక్కో ఖాళీ ఉంది. అకౌంటెంట్ పోస్టుకు కామర్స్‌లో డిగ్రీతో పాటు ట్యాలీ సాఫ్ట్ వేర్ పరిజ్ఞానం ఉండాలి. అసిస్టెంట్ కుక్, ప్యూన్ / అటెండర్ పోస్టులకు కనీసం 10వ తరగతి ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించారు. అసిస్టెంట్ కుక్ పోస్టుకు వంట నైపుణ్యాలను నిర్ధారించేందుకు డెమోన్స్ట్రేషన్ నిర్వహించనున్నారు. ఎంపిక విద్యార్హతలు, అనుభవం, అవ సరమైతే ఇంటర్వ్యూ లేదా డెమోన్స్ట్రే షన్ ఆధారంగా జరుగుతుందని తెలి పారు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హ తలు, వయస్సు, అనుభవ ధృవపత్రాల జిరాక్స్ ప్రతులతో కూడిన దరఖాస్తులను 9వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్, జనగామ లో సమర్పించాలని సూచిం చారు. మరిన్ని వివరాలకు స్పెషల్ ఆఫీసర్‌ను 98496 28441 నంబర్‌లో సంప్రదించ వచ్చని తెలిపారు.

# ధాన్యం కొనుగోళ్లలో జాప్యానికి తావులేదు

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లో ధాన్యం కొనుగోళ్లు, రవాణా ప్రక్రియ లో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శుక్రవారం రఘునాథపల్లి, నర్మెట్ట, చిల్పూర్ మండలాల్లోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల ను ఆయన పరిశీలించారు. కొ నుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మి ల్లులకు తరలించేందుకు అదనపు లారీ లు, ట్రాక్టర్లు, హమాలీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అకాల వర్షాల నేపథ్యంలో తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్ద తు ధర పొందాలని కోరారు. ధాన్యం తూకం, కొనుగోళ్లు, రవాణా ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహిం చాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో ఆర్డీఓ గోపీరాం, తహసీల్దా ర్లు తదితర అధికారులు పాల్గొన్నారు

# సూర్యాపేట మున్సిపాలిటీకి 'ఉత్తమ పర్యావరణ పనితీరు' పురస్కారం

* అవార్డు అందుకున్న చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) ప్రదానం చేసే ఉత్తమ పర్యావరణ పనితీరు పురస్కారం'కు సూర్యాపేట మున్సిపాలిటీ ఎంపికైంది. ఈ పురస్కారాన్ని శుక్రవారం హైదరాబాద్‌లోని టీజీపీసీబీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో దేవాదాయ, అటవీ శాఖ, ఎన్విరాన్ మెంట్ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి అందుకున్నారు. పట్టణంలో వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వ్యర్థాల పునర్వినియోగం, పారిశుధ్య కార్యక్రమాల అమలు, పర్యావరణ పరిరక్షణ చర్యల్లో సూర్యాపేట మున్సిపాలిటీ కనబరిచిన ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి వాటిని రీసైక్లింగ్ చేయడం, పర్యావరణ హిత కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా అమలు చేయడం మున్సిపాలిటీకి ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టాయి. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మి మాట్లాడుతూ సూర్యాపేట మున్సిపాలిటీకి లభించిన ఈ పురస్కారం పట్టణ ప్రజలు, పారిశుధ్య కార్మికులు, అధికారులు, ప్రజాప్రతినిధుల సమిష్టి కృషికి నిదర్శనమని అన్నారు. మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణలో సూర్యాపేట అమలు చేస్తున్న వినూత్న విధానాలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డుతో సూర్యాపేట మున్సిపాలిటీ రాష్ట్రంలో పర్యావరణహిత పట్టణాల జాబితాలో మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది.

# ప్రజలకు మౌలిక వసతులు కల్పించేలా కృషి చేస్తా

* జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : ప్రజలకు మౌలిక వసతులు కల్పించేలా కృషి చేస్తానని జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలో జగద్గిరి నగర్ లో* స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు తెలుసుకోవడానికి బస్తీ ప్రజలతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం జగన్ మాట్లాడుతూ తాను అధికారంలో ఉన్న లేకున్నా నిరంతరం డివిజన్ ప్రజలతో కలిసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. తాను కార్పొరేటర్ గా పదవి బాధ్యతలు చేపట్టిన నాటినుండి డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాలను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. జగద్గిరి నగర్. ( అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సీసీ రోడ్లు) తదితర మౌలిక వసతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశానని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. జగద్గిరి నగర్ లో చేపట్టవలసిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ డివిజన్ అధ్యక్షులు బొగ్గుల సురేష్. గణేష్. యాదగిరి నరసింహారెడ్డి సతీష్ ప్రభాకర్. పద్మనామం. బ్రహ్మాచారి. తదితరులు పాల్గొన్నారు


# అమ్మ పేరుతో మొక్కలు నాటిన ప్రజా హృదయం స్వచ్ఛంద సంస్థ



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ పట్టణంలో పర్యావరణ పరిరక్షణ కోసం విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజా హృదయం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్, మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్,వార్డు కౌన్సిలర్లు బి అజయ్ సారధి, చిదిరాల అరుణ్,మాదార బోయిన యాకన్న. గుంటి కార్తీక్ పర్యావరణ జాతీయ అవార్డు గ్రహీత దైద హర్షిత్. అధికారులు, ఉపాధ్యాయులు, పర్యావరణ ప్రేమికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.పట్టణంలోని ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించి పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హరిత మిత్ర అవార్డు గ్రహీత, వనమిత్ర దైద వెంకన్న మాట్లాడుతూ "ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానుకుని, పర్యావరణ హితమైన కాటన్ బ్యాగులను ఉపయోగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అమ్మ పేరుతో ఒక మొక్క" అనే సందేశంతో ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని , పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత. నేడు నాటిన ఒక మొక్క రేపటి తరాలకు ప్రాణవాయువును అందిస్తుంది. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి" అని అన్నారు.

# 198 ఎకరాల భూమి... విలువ రూ.30 వేల కోట్లు... కాపాడిన హైడ్రా!

- పుప్పాలగూడలో 198 ఎకరాల ప్రభుత్వ భూమికి కంచె
- రూ.30 వేల కోట్ల విలువైన ఈ భూమికి హైడ్రా రక్షణ
- చారిత్రక రాతి నిర్మాణాలను కాపాడేందుకు చర్యలు
- ఎన్జీవో ఫిర్యాదు, కోర్టు ఆదేశాలతో కదిలిన యంత్రాంగం
- కబ్జాల నివారణకు హైడ్రా ప్రత్యేక డ్రైవ్



హైద్రాబాద్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైడ్రా ఒక భారీ ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా వివాదాల్లో నలుగుతూ, కబ్జాదారుల కబంధ హస్తాల్లో చిక్కుకునే ప్రమాదంలో ఉన్న అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని రక్షించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడఖాజాగూడ సరిహద్దుల్లో ఉన్న 198 ఎకరాల ప్రభుత్వ భూమిని శుక్రవారం హైడ్రా తన ఆధీనంలోకి తీసుకుంది. సుమారు రూ.30,000 కోట్ల విలువ చేసే ఈ భూమిలో 250 కోట్ల సంవత్సరాల నాటి అరుదైన చారిత్రక రాతి గుట్టలు కూడా ఉండటం విశేషం. ఈ ఆపరేషన్‌తో అమూల్యమైన ప్రకృతి, చారిత్రక సంపదకు హైడ్రా రక్షణ కవచం ఏర్పాటు చేసింది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌ఎండీఏకు కేటాయించిన ఈ భూమిలో అద్భుతమైన రాతి శిలలు, గుహలు, పచ్చని చెట్లు ఉన్నాయి. ఈ చారిత్రక సంపదను కాపాడాలంటూ 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు దశాబ్దాలుగా న్యాయపోరాటం చేస్తున్నారు. వారి పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, 2019లోనే ఈ రాతి గుట్టలతో పాటు ప్రభుత్వ భూమిని సంరక్షించాలని మున్సిపల్, రెవెన్యూ శాఖలను ఆదేశించింది. అయితే, హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేయడంలో జాప్యం జరగడంతో భూమి కబ్జాకు గురయ్యే ప్రమాదం ఏర్పడింది. దీంతో 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెంటనే స్పందించి, క్షేత్రస్థాయిలో పర్యటించారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి సంయుక్తంగా సర్వే నిర్వహించి, భూమిని ప్రభుత్వ ఆస్తిగా నిర్ధారించుకున్నారు. అనంతరం శుక్రవారం పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం.. సర్వే నంబర్ 452/1లో 174 ఎకరాలు, 454/1లో 119.05 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఓవర్‌ల్యాప్ సమస్యల కారణంగా 63.05 ఎకరాలు ప్రైవేటు వ్యక్తులకు చెందినదిగా గుర్తించి, మిగిలిన భూమిలో దేవాలయాలకు 5 ఎకరాలు, దర్గాకు 5 ఎకరాలు కేటాయించగా, నికరంగా 200 ఎకరాల హెచ్‌ఎండీఏ భూమిని హైడ్రా కాపాడింది. ఈ ఆపరేషన్‌పై 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సహజ సిద్ధమైన వ్యూ పాయింట్లు, చారిత్రక గుట్టలను కాపాడి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసినందుకు హైడ్రాను అభినందించారు. స్థానిక ప్రజలు, పర్యావరణ ప్రేమికులు సైతం ప్రభుత్వ చొరవను కొనియాడారు. ఇదే సమయంలో, ఈ గుట్టలను ఆనుకుని ఉన్న భగీరథమ్మ చెరువును కూడా హైడ్రా పునరుద్ధరిస్తోంది. ఒకవైపు ఎత్తైన కొండలు, మరోవైపు జలకళతో నిండిన చెరువుతో ఈ ప్రాంతం భవిష్యత్తులో ఒక అద్భుతమైన పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# మొక్క నాటితేనే భవిష్యత్‌కు భరోసా

: అదనపు జూనియర్ సివిల్ జడ్జి అఖిల



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి: పర్యావరణాన్ని కాపాడితేనే అది మనల్ని కాపాడుతుందని అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీతో పాటు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తన పుట్టినరోజు సందర్భంగా కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్లీడర్ బొట్ల సుధాకర్, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూనూరు సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఆకుల రాములు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సృజన కుమారి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ పి. శ్రీనివాస్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కంప అక్షయ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

* డిఎస్పీ నంబూరు తిరుపతి రావు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: పర్యావరణ పరిరక్షణ సమాజంలోని అందరి భాధ్యత కావాలని మహబూబాబాద్ డిఎస్పీ నంబూరు తిరుపతి రావు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ రోటరిక్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డిఎస్పీ తిరుపతి రావు మాట్లాడుతూ పుడమితల్లికి పచ్చటి పందిరి వెయ్యాలనే రోటరీ సంకల్పం గొప్పదని అభినందించారు. చెట్ల నరికివేత, భూగర్భవనరుల విచ్చలవిడి వినియోగం, అపరిమిత ప్లాస్టిక్ ఉత్పత్తి వినియోగం లాంటి అవలక్షణాలు మానవాళి మనుగడకు గొడ్డలిపెట్టుగా మారాయని అన్నారు. తద్వారా ఓజోన్ పొర చిల్లులు పడి ఉష్ణోగ్రతలు పెరిగాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ లీడర్ వద్దుల సురేందర్, సెక్రెటరీ జంగాల విజయ్ కుమార్, ట్రెజరర్ శంతన్ రామరాజు, డిస్ట్రిక్ట్ లీడర్లు బిక్కి వెంకటేశ్వర్లు, కొడారి నాగేందర్, జంగాల నర్సింహారావు, జంగాల మంగపతి రావు, అచ్చ శ్రీనివాస్, కట్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి పౌరుడు బాధ్యత వహించాలి


* భగత్ సింగ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పచ్చి మట్ల నరేందర్ గౌడ్



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : పర్యావరణ పరిరక్షణకు ప్రతి పౌరుడు బాధ్యత వహించాలని భగత్ సింగ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పచ్చి మట్ల నరేందర్ గౌడ్ అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా భగత్ సింగ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కల నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలను నాటి భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించాలన్నారు. హరితహారం స్ఫూర్తితో ఒక్కొక్కరం ఒక మొక్క నాటుదాం.. ప్రకృతిని పరిరక్షిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో యూ బి డి విభాగం సూపర్ వైజర్ రాజు, జె వెంకటేష్, ఏ వెంకట్రెడ్డి (కెసి.ఆ.ర్), బీసు వెంకటేశం గౌడ్, గడ్డం రాము, టైలర్ మల్లేశం, ఈశ్వర్, జితేందర్ రెడ్డి, నాగరాజు, ప్రభాకర్ యాదవ్, రాములు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# సినిమా

## 'జన నాయగన్'.. థియేట్రికల్ డీల్స్ రద్దు.. ఎందుకంటే!



ఈ ఏడాది ప్రారంభం నుంచి వార్తల్లో ఉన్న చిత్రం 'జననాయగన్'. తమిళనాడు ముఖ్యమంత్రి, అగ్ర కథానాయకుడు విజయ్ చివరి సినిమాగా రూపొందిన 'జననాయగన్' సెన్సార్ కారణంగా ఆగిపోయిన విషయం తెలిసిందే. తాజాగా దీనికి సంబంధించిన ఓ వార్త చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమాకు సంబంధించిన థియేట్రికల్, నాన్‌థియేట్రికల్ డీల్స్ విషయంలో విజయ్ ఒక సంచలన నిర్ణయం తీసుకున్నట్లు కోలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి. జనవరి 9నే 'జననాయగన్' థియేటర్లలోకి రావాల్సిఉంది. అయితే, సెన్సార్ పరమైన కొన్ని ఇబ్బందుల వల్ల చివరి నిమిషంలో వాయిదా పడింది. ఐదు నెలలు గడిచినా ఇప్పటివరకు రిలీజ్ డేట్‌పై ఎలాంటి స్పష్టత రాలేదు. ఇప్పటికే ఈ సినిమా నాన్‌థియేట్రికల్ ఒప్పందాలు రద్దయినట్లు తెలుస్తోంది. దీనితోపాటు ఇప్పటివరకు జరిగిన అన్ని థియేట్రికల్ అగ్రిమెంట్లను కూడా రద్దు చేసి, డిస్ట్రిబ్యూటర్లకు అడ్వాన్స్ డబ్బులను తిరిగి ఇచ్చేయాలని విజయ్ నిర్మాతలకు సూచించినట్లు సమాచారం. దీంతో నిర్మాణసంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ మీటింగ్ ఏర్పాటుచేసినట్లు తెలుస్తోంది. సినిమా విడుదల తేదీ ఖరారైన తర్వాత సొంతంగా (ఇండిపెండెంట్‌గా) రిలీజ్ చేసుకోవాలని విజయ్ సలహా ఇచ్చారట. హెచ్.వినోద్ దర్శకత్వంలో సామాజిక కథాంశంతో రూపొందిన చిత్రం 'జన నాయగన్'. ఈ పొలిటికల్ డ్రామాను కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మించింది. ఇందులో విజయ్‌కు జోడీగా పూజా హెగ్డే నటించారు. మమితా బైజూ, బాబీ దేవోల్ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం తెలుగు హిట్ సినిమా 'భగవంత్ కేసరి' ఆధారంగా రూపొందినట్లు గతంలో వార్తలు వచ్చాయి.



## దూత-2 లాంచ్

నాగచైతన్య తెలుగు హారర్ థ్రిల్లర్ వెబ్‌సిరీస్ దూత ఓటీటీ ప్రేక్షకులను మెప్పించింది. దూత 2 శుక్రవారం లాంఛ్ అయ్యింది. ఈ సిరీస్ ఓపెనింగ్ ఈవెంట్‌కు నాగార్జున గెస్ట్‌గా హాజరయ్యారు. నాగచైతన్య, ప్రియా భవానీ శంకర్, పార్వతి తిరువోతులపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి ఆయన క్లాప్ ఇచ్చారు. ఈ సిరీస్‌తోనే నాగచైతన్య ఓటీటీలోకి ఎంట్రీ ఇచ్చాడు. దూత కాన్సెప్ట్, విక్రమ్ కే కుమార్ టేకింగ్, ట్విస్ట్‌లు, టర్న్‌లతో పాటు జర్నలిస్ట్ పాత్రలో నాగచైతన్య యాక్టింగ్‌కు మంచి పేరొచ్చింది. ఈ సిరీస్‌లో ప్రియా భవానీ శంకర్, పార్వతి తిరువోతు, ప్రాచీ దేశాయ్, తరుణ్ భాస్కర్ కీలక పాత్రల్లో నటించారు. విక్రమ్ కే కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. దూత 2 తానే స్వయంగా నిర్మించబోతున్నట్లు నాగచైతన్య ప్రకటించారు. నాగచైతన్య భార్య శోభిత ధూళిపాళ ఓ కీలక పాత్రలో నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది.



## ఇక పోలీస్ ఆఫీసర్‌గా..

కెరీర్ ఆరంభం నుంచి ట్రెడిషనల్ రోల్స్, పక్కింటి అమ్మాయి తరహా పాత్రల్లోనే ఎక్కువగా కనిపిస్తోంది సాయిపల్లవి. గత సినిమాలకు భిన్నంగా ఫస్ట్ టైమ్ యాక్షన్ రోల్ చేయబోతుంది. ఓ తమిళ సినిమాలో ఖాకీ యూనిఫామ్‌లో కనిపించబోతుంది. ధనుష్ హీరోగా అమరన్ ఫేమ్ రాజ్ కుమార్ పెరియాసామి దర్శకత్వంలో ఓ పాన్ ఇండియన్ మూవీ తెరకెక్కుతోంది. స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా రానున్న ఈ మూవీలో సాయిపల్లవి, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తోన్నారు. సాయిపల్లవి పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనుందట. లేడీ సింగం తరహాలో పవర్‌ఫుల్‌గా ఆమె పాత్ర సాగుతుందని అంటున్నారు. డీ 55 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమాకు సాయి అభ్యంకర్ మ్యూజిక్ అందిస్తున్నాడు. మలయాళ నటుడు మమ్ముట్టి ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తు తం ఏపీలో జరుగుతోంది. త్వరలోనే సాయిపల్లవి జాయిన్ కాబోతున్నట్లు సమాచారం.



## అవమానించారంటూ నెటిజన్ పోస్ట్.. లైక్ కొట్టిన జాన్వీ

పెద్దిలో జాన్వీ కపూర్ రోల్‌ను చూపించిన తీరుపై నెటిజన్ల నుంచి విమర్శలు వస్తున్నాయి. జాన్వీ పాత్ర డైలాగ్స్, రామ్‌చరణ్‌తో ఆమె కెమిస్ట్రీలో బూతులు ఎక్కువయ్యాయని ట్రోల్ చేస్తున్నారు. ఈ విమర్శల నేపథ్యంలో జాన్వీ ఇచ్చిన ఓ పాత ఇంటర్వ్యూ వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. ఇండియన్ సినిమా హిస్టరీలోనే ఏ హీరోయిన్‌కు ఇంతలా అవమానం జరగలేదని, పెద్దిలో జాన్వీని చాలా అగౌరవంగా చూపించారంటూ ఓ నెటిజన్ పోస్ట్ పెట్టాడు. అతడి ట్వీట్‌ను జాన్వీ లైక్ చేయడం ఆసక్తికరంగా మారింది. నెటిజన్ కామెంట్‌ను లైక్ చేసి ఇన్‌డైరెక్ట్‌గా జాన్వీ మేకర్స్‌పై అసంతృప్తిని వ్యక్తం చేసిందని, తన పాత్రను అభ్యంతరకర రీతిలో యాంగిల్స్ పెడుతుంటారు. అలా చూపించొద్దు... ఇబ్బందిగా ఉంటుందని చెప్పాలనిపిస్తుంది. చెబితే రూడ్‌గా బిహేవ్ చేశానని నిందలు వేస్తారు. కెరీర్‌లో అలాంటి ఇబ్బందులు చాలానే ఎదురయ్యాయి" అని జాన్వీ చెప్పడం గమనార్హం.

## నందమూరి హీరోతో బేబమ్మ రొమాన్స్



ఉప్పెన మూవీతో హీరోయిన్‌గా తెలుగు ఇండస్ట్రీలో అడుగుపెట్టింది కృతి శెట్టి. ఉప్పెన తర్వాత కృతి శెట్టి చాలానే సినిమాలు చేసింది. కానీ లక్ మాత్రం కలిసిరాలేదు. అవకాశాల కోసం రెండేళ్లుగా ఎదురుచూస్తోన్న ఈ బ్యూటీ క్రేజీ ఆఫర్‌ను దక్కించుకోంది. అనిల్ రావిపూడి నెక్స్ట్ మూవీలో ఓ హీరోయిన్‌గా కనిపించబోతుంది. వెంకటేష్, కళ్యాణ్ రామ్ హీరోలుగా ఓ మల్టీస్టారర్ మూవీని తెరకెక్కించబోతున్నారు. ఇందులో కళ్యాణ్ రామ్‌కు జోడీగా కృతి శెట్టి కనిపించబోతుంది. కామెడీ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న ఈ మూవీ స్క్రిప్ట్ వర్క్ కంప్లీట్ అయ్యిందట. జూన్ 22 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానున్నట్లు సమాచారం. హైదరాబాద్‌లో జరగనున్న ఫస్ట్ షెడ్యూల్‌లో కళ్యాణ్ రామ్, కృతిశెట్టి లవ్ ట్రాక్, రొమాంటిక్ సీన్లను డైరెక్టర్ తెరకెక్కించబోతున్నారట. వెంకటేష్ సరసన కీర్తి సురేష్ కనిపించనున్నట్లు చెబుతోన్నారు.

## హీరోగా కమెడియన్

ఓ తెలుగు వెబ్‌సిరీస్ కోసం టాలీవుడ్ కమెడియన్ హర్ష చెముడు హీరోగా మారారు. లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ పేరుతో రూపొందుతోన్న ఈ వెబ్ సిరీస్ శుక్రవారం లాంఛయ్యింది. ఓపెనింగ్ ఈవెంట్‌కు మెగా హీరో సాయిధరమ్‌తేజ్‌తో పాటు చందూ మొండేటి గా హాజరయ్యారు. బాబు దర్శకత్వం వహిస్తున్న ఈ సిరీస్‌లో జబర్దస్త్ కమెడియన్లు ఆటో రాంప్రసాద్, బాబు కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. కిరణ్ అబ్బవరం మేనేజర్ చవన్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించనున్నాడు. పెళ్లి కోసం ఓ యువకుడు పడే కష్టాల చుట్టూ వినోదాత్మకంగా ఈ సిరీస్ సాగనున్నట్లు సమాచారం. ఈటీవీ విన్ ఓటీటీలో అక్టోబర్‌లో ఈ సిరీస్ రిలీజ్ కాబోతుంది.



## 'పెద్ది' ఫస్ట్‌డే కలెక్షన్స్.. బాక్సాఫీస్ ఛాంపియన్ అంటూ పోస్టర్




ఆటలోనూ, పోరాటంలోనూ ఛాంపియన్ అనిపించుకున్నాడు 'పెద్ది'. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కించిన ఈ సినిమా తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చి హిట్‌గా నిలిచింది. పెద్దిగా రామ్ చరణ్ తన నటనతో మెప్పిస్తుండగా.. చాలా రోజుల తర్వాత ఆయన ఖాతాలో హిట్ పడిందంటూ అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ సినిమా మొదటి రోజు కలెక్షన్స్‌ను నిర్మాణ సంస్థ తాజాగా వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఫస్ట్‌డే రూ.135.36 కోట్లు వసూలుచేసినట్లు అధికారికంగా ప్రకటించింది. 'బాక్సాఫీస్ ఛాంపియన్' అంటూ పోస్టర్ విడుదల చేసింది.

**'పెద్ది' కథేంటంటే..**

విజయనగరం జిల్లాలోని కొండ కింద ఊరు అది. వందల మంది జీవనం సాగిస్తున్నా, ప్రభుత్వ రికార్డుల్లో ఆ ఊరికి గుర్తింపు అన్నదే ఉండదు. అందుకే ఆ ఊరు అన్నా, అక్కడి నుంచి వచ్చిన మనుషులన్నా అందరికీ చిన్న చూపు. ఆ ఊళ్లో పుట్టి పెరిగినవాడే పెద్ది (రామ్‌చరణ్). రోజూ విజయనగరం వెళ్లి కూలి పనులు చేసుకుంటుంటాడు. పేరుకి కూలి అయినా క్రికెట్‌లో మాత్రం రాటుదేలిన ఆటగాడు. అందుకే విజయనగరం, బొబ్బిలి క్రికెట్ జట్లు వేలంలో పెద్దిని కొనేందుకు పోటీపడుతుంటారు. అలాంటి ఆటగాడు క్రికెట్‌ని వదిలి కుస్తీ క్రీడాకారుడిగా ఎందుకు మారాల్సివచ్చింది? పెద్ది ప్రయాణంపై అప్పలసూరి (జగపతిబాబు), గౌర్‌నాయుడు (శివరాజ్‌కుమార్) ఎలాంటి ప్రభావం చూపించారు? ఈ కథలో అచ్చియమ్మ (జాన్వీ కపూర్) ఎవరు? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

## 'పెద్ది' సంచలన విజయం..

### చిరంజీవి నివాసం వద్ద గ్రాండ్ సెలబ్రేషన్స్.. ఉపాసన సందడి!

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటించిన లేటెస్ట్ సెన్సేషన్ 'పెద్ది' సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్లతో, పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతోంది. మొదటి షో నుంచే ప్రేక్షకుల నుండి ఈ చిత్రానికి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈ నేపథ్యంలో రామ్ చరణ్ భార్య ఉపాసన స్వయంగా మెగా ఫ్యాన్స్‌తో కలిసి ఈ విజయానందాన్ని పంచుకోవడం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. హైదరాబాద్‌లోని మెగాస్టార్ చిరంజీవి నివాసంలో జరిగిన 'పెద్ది' సక్సెస్ సెలబ్రేషన్స్‌లో ఉపాసన పాల్గొన్నారు. అభిమానుల మధ్యకు వచ్చి, వారితో కలిసి స్పెషల్ విక్టరీ కేక్‌ను కట్ చేశారు. ఈ వేడుకకు తరలివచ్చిన చిన్నారులకు ఉపాసన తన చేతులతో కేక్ తినిపించి, అభిమానులతో ఎంతో ఆప్యాయంగా మాట్లాడి అందరి మనసులను గెలుచుకున్నారు. ఈ సంబరాల్లో అభిమానులు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి రచ్చ చేయగా.. మెగా



మహిళా అభిమానులు ఉపాసనకు సాంప్రదాయబద్ధంగా దిష్టి తీసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం నెట్టింట విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. కేవలం ఇంట్లోనే కాకుండా, బుధవారం రాత్రి హైదరాబాద్ మూసాపేటలోని 'శ్రీ రాములు థియేటర్'లో జరిగిన 'పెద్ది' ప్రీమియర్ షోకు ఉపాసన తన తల్లిదండ్రులతో కలిసి హాజరయ్యారు. సాధారణ ప్రేక్షకుల మధ్య కూర్చుని సినిమా చూసిన ఆమె.. స్క్రీన్‌పై రామ్ చరణ్ ఎంట్రీ సీన్ వచ్చినప్పుడు థియేటర్‌లో మిగతా ఫ్యాన్స్‌తో కలిసి ఎంతో ఉత్సాహంగా కేకలు వేస్తూ సందడి చేశారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.